www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -343 శనివారం 21 మార్చి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# 3,24,234 కోట్లు

## శాసనసభలో బడ్జెట్ ప్రతిపాదించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- రెవెన్యూ వ్యయం 2,34,406 కోట్లు
- మూలధన వ్యయం రూ.47,267 కోట్లు
- మండలిలో పద్దును ప్రవేశపెట్టిన మంత్రి ఉత్తమ్
- 'చేయూత'తో 2 లక్షల మందికి కొత్త పింఛన్లు
- ప్రీప్రైమరీ నుంచి ఇంటర్ వరకు బ్రేక్‌ఫాస్ట్ పథకం
- ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం
- గోదావరి పుష్కరాలకు రూ.500 కోట్లు
- ఉభయసభలు సోమవారానికి వాయిదా




హైదరాబాద్ మార్చి 20 ప్రజావినికిడి,
2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ రాష్ట్ర బడ్జెట్ రూ.3,24,234 కోట్లుగా డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లుగా, మూలధన వ్యయం రూ.47,267 కోట్లుగా చూపెట్టారు. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.ఐదు లక్షల చొప్పున జీవిత బీమా అందించేలా ఈ ఏడాది జూన్ 2వ తేదీన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నట్టు ప్రకటించారు. చేయూత పథకం ద్వారా అర్హులైన 2 లక్షల మందికి నూతన పింఛన్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు మిగతా 2లో...

# పిరికివాళ్లు

## : నాటో దేశాలపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం

- ఇరాన్‌తో యుద్ధంలో కలిసి రావడానికి ఇష్టపడడంలేదన్న ట్రంప్
- ఇప్పుడు అధిక చమురు ధరల గురించి ఫిర్యాదు చేస్తున్నారని ఆగ్రహం
- హర్మూజ్ జలసంధిని తెరవడానికి రావడం లేదని విమర్శ
- ఈ పిరికివాళ్లను గుర్తుంచుకుంటామని హెచ్చరిక

న్యూఢిల్లీ,మార్చి 20 ప్రజావినికిడి,
హర్మూజ్ జలసంధిని తెరవడానికి ముందుకు రావాలని తాను చేసిన విజ్ఞప్తిని నాటో దేశాలు పట్టించుకోకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటో దేశాల వ్యవహారశైలిపై తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా చిందులు వేశారు. అమెరికా లేని 'నాటో' ఓ కాగితపు పులి అని, అమెరికా లేకుండా ఏమీ చేయలేదని మండిపడ్డారు. ఇరాన్‌పై యుద్ధంలో చేరనందుకు, హర్మూజ్ జలసంధిని తెరవడంలో సహకరించనందుకు వారిని గుర్తించుకుంటామని హెచ్చరిక చేశారు. మిగతా 2లో...



# ఆరు గ్యారెంటీలపై నిలదీస్తూనే ఉంటాం

## గన్ పార్క్ వద్ద బిఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన

## ప్లకార్డులతో ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శన



# అంతర్జాతీయ ప్రమాణాలతో

## విపత్తుల శిక్షణా కేంద్రం

డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై మంత్రి పొంగులేటి సమీక్ష



2లో.

# ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లలో స్కాంలు

- వేయికోట్ల కుంభకోణం జరిగింది
- రిటైర్డ్ అధికారుల నియామకంతో లాలూచీ
- స్కాం వివరాలను అసెంబ్లీలో ఎండగడతాం



# కనిపించిన నెలవంక..

## ముగిసిన రంజాన్ ఉపవాసాలు -నేడు పవిత్ర రంజాన్ పండగ

న్యూఢిల్లీ,మార్చి 20 ప్రజావినికిడి,
పవిత్ర రంజాన్ మాసం ముగిసింది. చివరి శుక్రవారం దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గురువారం నెలవంక దర్శనం లేకపోవడంతో శుక్రవారం నెలవంక ఆధారంగా శనివారం రంజాన్ పండగను నిర్ణయించారు. దీంతో నెల రోజుల ఉపవాస దీక్షలను విరమించి పండగను జరుపకోబోతున్నారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లో 9వ నెల అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం. ఈ పవిత్ర మాసంలో ముస్లింలు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఉపవాసం ఉండి ప్రార్థనలు ఆచరించారు. ఖురాన్ పఠించారు. ముఖ్యంగా ఈ మాసంలో దానధర్మాలు విరివిగా చేస్తారు.



## అప్పు తిరిగివ్వాలని అడగడం

# ఆత్మహత్యకు ప్రేరేపణ కాదు

- : సుప్రీంకోర్టు కీలక తీర్పు
- గుజరాత్‌కు చెందిన వ్యక్తిపై
- నమోదైన క్రిమినల్ కేసు కొట్టివేత
- సూసైడ్ నోట్‌లో బెదిరింపుల
- వివరాలు లేవని పేర్కొన్న ధర్మాసనం
- అప్పు తిరిగివ్వమని రుణదాత ఫోన్
- చేయడం చట్టబద్ధమైన చర్యేనని వ్యాఖ్య



2లో.

# గోదావరిలో ఐదుగురు విద్యార్థులు గల్లంతు...

- సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి
- పోలవరం జిల్లాలో విషాదం
- గోదావరి నదిలో స్నానానికి వెళ్లిన
- ఏడుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు
- నీటిలో కొట్టుకుపోయిన ఐదుగురు విద్యార్థులు...
- మరో ఇద్దరు ఒడ్డుకు చేరిన వైనం
- ఇప్పటివరకు ముగ్గురి మృతదేహాల వెలికితీత
- మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు



2లో.

# అప్పు తిరిగివ్వాలని అడగడం ఆత్మహత్యకు ప్రేరేపణ కాదు

## : సుప్రీంకోర్టు కీలక తీర్పు

**న్యూఢిల్లీ,మార్చి 20 ప్రజావినికిడి,**
అప్పు తిరిగి చెల్లించాలని అడగడం లేదా ఒత్తిడి చేయడం ఆత్మహత్యకు ప్రేరేపించడం కిందకు రాదని సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. కేవలం రుణం తిరిగివ్వాలని డిమాండ్ చేయడాన్ని నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు గుజరాత్‌కు చెందిన ఓ వ్యక్తిపై నమోదైన ఆత్మహత్య ప్రేరేపణ కేసును కొట్టివేసింది. ఈ కేసులో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తోసిపుచ్చుతూ జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పు ఇచ్చింది.

### కేసు నేపథ్యం ఏమిటంటే..
గుజరాత్‌లోని మోర్బీ జిల్లాలో ఒక వ్యక్తి ట్రాక్టర్ ట్రాలీ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పలువురు అప్పుల వాళ్లు వేధిస్తున్నారని ఆరోపిస్తూ అతను రాసిన సూసైడ్ నోట్ పోలీసులకు లభించింది. ఆ నోట్‌లో తొమ్మిది మంది రుణదాతల పేర్లను పేర్కొన్నాడు. వారిలో ఒకరైన ధీరూభాయ్ నంజీభాయ్ పటేల్ లోత్వాలాపై పోలీసులు ఐపీసీ సెక్షన్ 306 (ఆత్మహత్యకు ప్రేరేపణ), 506(2) (నేరపూరిత బెదిరింపు) కింద కేసు నమోదు చేశారు. మృతుడికి ఆరు నెలల వ్యవధిలో నిందితుడు సుమారు 40 సార్లు ఫోన్ చేసినట్లు కాల్ రికార్డులను ప్రాసిక్యూషన్ ఆధారాలుగా చూపింది. తనపై కేసును కొట్టివేయాలని ధీరూభాయ్ మొదట గుజరాత్ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ ఊరట లభించలేదు. దీంతో ఆయన సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు.

### సుప్రీంకోర్టు ఏమంది?
ఈ కేసును విచారించిన సుప్రీం ధర్మాసనం, ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాలు ఆత్మహత్య ప్రేరేపణను నిరూపించడానికి సరిపోవని అభిప్రాయపడింది. "సూసైడ్ నోట్‌లో తొమ్మిది మంది పేర్లు ఉన్నప్పటికీ, ఎవరి పాత్ర ఏమిటో స్పష్టంగా లేదు. బెదిరింపుల స్వభావం, అవి ఎప్పుడు, ఎక్కడ జరిగాయనే వివరాలు లేవు. అందరు రుణదాతలను ఒకే గాటన కట్టారు. ఇలాంటి సూసైడ్ నోట్ ఆధారంగా విచారణ జరపడం వృధా ప్రయాస అవుతుంది" అని ధర్మాసనం పేర్కొంది.
అప్పు తిరిగివ్వమని రుణదాత ఫోన్ చేయడం చట్టబద్ధమైన చర్యేనని, కేవలం ఎక్కువసార్లు ఫోన్ చేసినంత మాత్రాన దానిని నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. మృతుడిపై శారీరక దాడి లేదా బలవంతం జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేవని కోర్టు గమనించింది. ఈ పరిస్థితుల్లో నిందితుడిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ కొనసాగించడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుందని వ్యాఖ్యానించింది. ఈ మేరకు ధీరూభాయ్‌పై నమోదైన ఎఫ్ఐఆర్, తదుపరి చర్యలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

# అంతర్జాతీయ ప్రమాణాలతో విపత్తుల శిక్షణా కేంద్రం

**డిజాస్టర్ మేనేజిమెంట్‌పై మంత్రి పొంగులేటి సమీక్ష**

**హైదరాబాద్,మార్చి 20 ప్రజావినికిడి,**
అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శిక్షణా కేంద్రాన్నిఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం సంబంధిత విభాగాల నుంచి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసుకొని కార్యాచరణ రూపొందించాలని సూచించారు. దీనిపై గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖలకు విపత్తు నిర్వహణపై ఒకే విధమైన శిక్షణను అందించడం, శాస్త్రీయ పద్ధతుల ద్వారా ప్రాణ నష్టాన్ని, ఆర్థిక నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించడం, క్షేత్రస్థాయిలో, ముఖ్యంగా జిల్లాల్లో విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించడం. విపత్తుల నివారణకు సంబంధించి ఇది ఒక అత్యున్నత పరిశోధన మరియు పాలసీ సపోర్ట్ కేంద్రంగా పనిచేస్తుందని అన్నారు. శుక్రవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో విపత్తుల నిర్వహణా విభాగం, ఫైర్ సర్వీసెస్, ఎస్‌డిఆర్‌ఎఫ్, హైడ్రా, ఐ సిసిసి విభాగాలతో మంత్రి గారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ విపత్తులు సంభవించినప్పుడు కేవలం సహాయక చర్యలకే పరిమితం కాకుండా, ముందస్తు సన్నద్ధతతో నష్టాన్ని తగ్గించే లక్ష్యంతో 'స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్' ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. విపత్తుల నిర్వహణలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎటువంటి విపత్తులనైనా ఎదుర్కొనేలా అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. వరదలు, అగ్నిప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించడానికి కచ్చితమైన సమాచార వ్యవస్థ, రియల్ టైమ్ మానిటరింగ్, సాధ్యమయ్యేలా విపత్తు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డ్రోన్‌లు, హైస్పీడ్ బోట్లు వంటివాటిని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దానకిశోర్ , అగ్నిమాపకశాఖ డైరెక్టర్ విక్రమాన్ సింగ్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఐసిసిసి డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి, స్పెషల్ పోలీస్ బెటాలియన్ అడిషనల్ డిజీ సంజయ్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లలో స్కాంలు

**వేయికోట్ల కుంభంకోణం జరిగింది**

**రిటైర్డ్ అధికారుల నియామకంతో లాలూచీ**

**స్కాం వివరాలను అసెంబ్లీలో ఎండగతాం**

**హైదరాబాద్మార్చి 20 ప్రజావినికిడి,**
ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లలో స్కాంలు కొనసాగుతున్నాయని బిఆర్ఎస్ ఎ మ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. రిటైర్డ్ ఉద్యోగులను పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి స్కాంలు చేస్తున్నాడని అన్నారు. అందులో సీఈ, ఈఎన్సీ అందరూ రిటైర్డ్ వాళ్లే ఉన్నారని తెలిపారు. నాలుగైదు స్కూళ్లను ప్యాకేజీ చేసి అన్యాయాలకు తెర తీశారని హరీశ్‌రావు మండిపడ్డారు. వీటి టెండర్లలో రూ.1000 కోట్ల స్కాం జరిగిందని అన్నారు. ఇందులో బీజేపీ వారికి ఒకటి, రెండు ప్యాకేజీలు దక్కాయని తెలిపారు. సమయం వచ్చినప్పుడు ఆ వివరాలన్నీ బయటపెడతామని స్పష్టం చేశారు. ఈ వందల కోట్ల టెండర్ల కుంభకోణంపై శాసనసభలో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని అన్నారు. నా దగ్గర ఈ స్కామ్ కు సంబంధించి ఇంకా పూర్తి ఆధారాలు, వివరాలు ఉన్నాయని.. వాటన్నింటినీ అసెంబ్లీ సమావేశాల్లో సభ సాక్షిగా బయటపెడతానని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 76 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు టెండర్లు పూర్తి చేయగా, అందులో ఒక్కటంటే ఒక్కటి కూడా బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలున్న 26 నియోజకవర్గాలకు ఇవ్వలేదని హరీశ్‌రావు తెలిపారు. కక్షపూరితంగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు స్కూళ్లు మంజూరు చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు, అలాగే కొందరు బీజేపీ ఎమ్మెల్యేలకు మాత్రం స్కూళ్లు కేటాయించారని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో భారీ అవినీతి జరుగుతోందని హరీశ్‌రావు అన్నారు. కాంట్రాక్టర్లు ఆర్గనైజ్డ్ రింగ్ గా అయ్యి పనులను పంచుకుంటున్నారని అన్నారు. 76 స్కూళ్లకు సంబంధించిన ప్రతి టెండర్ కి ఎక్సెస్ ధర కోట్ చేసి దక్కించుకున్నారని తెలిపారు. టెండర్లలో కనిష్టంగా 4.59? నుంచి గరిష్టంగా 4.96? ఎక్సెస్‌తో, నిబంధనల ప్రకారం 5? దాటకుండా పక్కా ఎ÷-లాన్‌తో కొల్లగొట్టారని విమర్శించారు. ఒక్కో స్కూలుకు రూ. 250 కోట్లు కేటాయించగా, అందులో సివిల్ వర్క్స్ కోసమే సుమారు రూ. 150 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారని చెప్పారు. 76 స్కూళ్లకు సంబంధించి ప్రభుత్వ అంచనా వ్యయం రూ. 10,199.54 కోట్లు కాగా, కాంట్రాక్టర్లు దాన్ని రూ. 10,693.55 కోట్ల ఎక్సెస్‌తో దక్కించుకున్నారని అన్నారు. అంటే కేవలం ఈ టెండర్ల ద్వారా సుమారు రూ. 494 కోట్లు ప్రజాధనాన్ని అదనంగా దోచిపెడుతున్నారని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ తో పాటు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిరల్లో అత్యధికంగా 4.95 శాతం ఎక్సెస్ ధరకు టెండర్లు కేటాయించడం పలు అనుమానాలకు కలిగిస్తున్నాయని హరీశ్‌రావు అన్నారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క నియోజకవర్గంలో 4.95 ఎక్సెస్.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గం హుజూర్ నగర్ లో 4.95 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గం హుస్నాబాద్ లో 4.95 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని.. మంత్రి జూపల్లి కృష్ణారావు నియోజకవర్గం కొల్లాపూర్ లో 4.77 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని చెప్పారు. మంత్రి కొండా సురేఖ నియోజకవర్గం వరంగల్ ఈస్ట్ లో 4.99 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారన్నారు. మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి నియోజకవర్గం నల్గొండలో 4.87 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారన్నారు.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నియోజకవర్గం మంథనిలో 4.89 కు ఎక్సెస్ టెండర్ ఇచ్చారని తెలిపారు. ఆశ్చర్యకరంగా ముఖ్యమంత్రి నియోజకవర్గంతో పాటు ఏకంగా 9 స్కూళ్ల టెండర్లను ఈ ప్రభుత్వం అదే సంస్థకు కట్టబెట్టిందని పేర్కొన్నారు. మంత్రుల నియోజకవర్గాల్లోనే ఎక్కువ ధరకు టెండర్లు ఖరారు కావడం ఈ కుంభకోణానికి నిదర్శనమని చెప్పారు. నాడు కేసీఆర్ పదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఏనాడూ రాజకీయ పక్షపాతం చూపలేదని గుర్తుచేశారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు సమానంగా ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. మిషన్ కాకతీయ మొదటి దశ నుంచే, మిషన్ భగీరథ, బీసీ,మైనార్టీ గురుకులాలు ఇలా ఏ పథకమైనా 119 నియోజకవర్గాలకు సమానంగా ఇచ్చారని అన్నారు మెడికల్ కాలేజీలను అన్ని జిల్లాలకు ఇస్తూ, నేటి కాంగ్రెస్ మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గానికి కూడా ఇచ్చామని తెలిపారు దళిత బంధు లాంటి గొప్ప పథకాన్ని ప్రతిపక్ష నేతగా ఉన్న భట్టి విక్రమార్క నియోజకవర్గమైన మధిర చింతకాని నుంచే పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ఘనత కేసీఆది అని హరీశ్‌రావు కొనియాడారు.

# గోదావరిలో ఐదుగురు విద్యార్థులు గల్లంతు...

పోలవరం,**మార్చి 20 ప్రజావినికిడి,**
ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లాలో శుక్రవారం ఘోర విషాదం చోటుచేసుకుంది. గోదావరి నదిలో స్నానానికి వెళ్లి ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు గల్లంతయ్యారు. ఇప్పటివరకు ముగ్గురి మృతదేహాలను వెలికితీయగా, మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.
పోలీసుల వివరాల ప్రకారం, అమరావతిలోని ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ఉగాది సెలవుల సందర్భంగా విహారయాత్రకు వెళ్లారు. భద్రాచలం సందర్శన అనంతరం ఎటపాక మండలం పురుషోత్తపట్నం వద్ద గోదావరి నదిలో స్నానం చేసేందుకు దిగారు. నది లోతుపై అవగాహన లేకపోవడంతో నీటి ప్రవాహానికి ఐదుగురు కొట్టుకుపోయారు. మరో ఇద్దరు విద్యార్థులు చాకచక్యంగా ఒడ్డుకు చేరుకున్నారు.సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు పడవల సాయంతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సి. శ్రీకర్ (భద్రాచలం), పి. అభిరామ్ (విజయనగరం), నవదీప్ (ఉయ్యూరు) మృతదేహాలు లభ్యమయ్యాయి. గల్లంతైన గోక తేజ (ఉయ్యూరు), పాశం సతీష్ కుమార్ (మదనపల్లె) కోసం గాలింపు కొనసాగుతోంది. ప్రమాదం నుంచి బయటపడిన వారిని చందూరి దీపక్, గడ్డం హర్షవర్ధన్‌గా గుర్తించారు.ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. గల్లంతైన విద్యార్థుల కోసం గాలింపు ముమ్మరం చేయాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

# కనిపించిన నెలవంక..

**మొదటి పేజీ తరువాయి**
పవిత్ర ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ఆత్మ పరిశీలనకు, స్వీయ క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. ఇలా నెల రోజుల ఉపవాసాల అనంతరం నెలవంక కనిపించిన తర్వాత ఈద్ అల్ ఫితర్ అంటే రంజాన్ పండుగ జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు జరుపుకునే అతిముఖ్యమైన పండుగల్లో రంజాన్ అత్యంత ప్రధానమైనది. ఎంతో భక్తి శ్రద్ధలతో నియమ నిష్టలతో రంజాన్ పండుగను ఆచరించారు. ముస్లిం ఆచరించే చంద్రమాన క్యాలెండర్‌లో రంజాన్ లేదా రమాదన్ అనేది తొమ్మిదో నెల. ఈ రంజాన్ పండుగ ఆధ్యాత్మిక చింతన, దానధర్మాలు, క్రమశిక్షణ వంటి వాటికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ రంజాన్ నెలలోనే పవిత్ర ఖురాన్ అవతరించిందని ముస్లిం పండితులు చెబుతారు. సాధారణంగా సౌదీ అరేబియాలో నెలవంక కనపించిన తర్వాతి రోజు భారత్‌లో రంజాన్ మాసంప్రారంభం కావడం అనేది ఆనవాయితీగా వస్తోంది. ఇక రంజాన్ పండుగ మార్చి 20 తేదీన నెలవంక దర్శనం ఆధారంగా జరుపుకుంటున్నారు.

# పిరికివాళ్లు

**మొదటి పేజీ తరువాయి**
"అమెరికా లేకుండా నాటో ఒక పేపర్ టైగర్ వంటిదే. అణ్వాయుధాలు కలిగిన ఇరాన్‌ను ఆపడానికి జరుగుతున్న యుద్ధంలో వారు చేరడానికి ఇష్టపడటం లేదు. కానీ తక్కువ నష్టంతో మా సైన్యం విజయం సాధించింది. అయినప్పటికీ నాటో దేశాలు ఇప్పుడు తాము చెల్లించవలసి వస్తున్న అధిక చమురు ధరల గురించి ఫిర్యాదు చేస్తున్నారు. కానీ అధిక చమురు ధరలకు కారణమైన హర్మూజ్ జలసంధిని తెరవడానికి నాటో దేశాలు ఇష్టపడటం లేదు. ఒక సాధారణ సైనిక విన్యాసం ద్వారా హర్మూజ్ జలసంధిని తెరవొచ్చు. కానీ సహకరించేందుకు వారు ముందుకు రావడం లేదు. వారు పిరికివాళ్లు, వారిని గుర్తుంచుకుంటాం" అని ట్రంప్ హెచ్చరించారు.

# ఆరు గ్యారెంటీలపై నిలదీస్తూనే ఉంటాం

**హైదరాబాద్మార్చి 20 ప్రజావినికిడి,**



ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గన్‌పార్క్ నుంచి అసెంబ్లీకి ర్యాలీకి బయల్దేరి వచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యమని గ్యారంటీ కార్డులు ఇచ్చి భద్రం చేసుకోమన్నారని గుర్తుచేశారు. ఇంతవరకు ఒక్క గ్యారంటీని నెరవేర్చిందని లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజల తరఫున వృద్ధులు, వితంతువుల తరఫున బడ్జెట్ ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. రూ.2500 మహాలక్ష్మి నిధులు ఎప్పుడిస్తారని నిలదీస్తామని తెలిపారు. కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు నీటిమూటలయ్యాయని విమర్శించారు. బడ్జెట్‌లో రైతులకు, బీసీలకు జరుగుతున్న అన్యాయంపై నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. సంక్రాంతి, ఉగాది గడిచినా రైతు భరోసా పడలేదని అన్నారు. ఉద్యోగాలపై బొంకుతున్న కాంగ్రెస్‌ను అసెంబ్లీలో నిలదీస్తామని తెలిపారు. హామీలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. చట్టసభల్లో చర్చ అంటేనే ప్రభుత్వం లాగు తడుస్తోందని మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనచారి ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలకు అసెంబ్లీలో జవాబు ఇవ్వని పరిస్థితి ఉందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండటం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలను బుల్డోజ్ చేస్తుందని మధుసూదనచారి మండిపడ్డారు. ప్రతిపక్షాలు అడిగిన ఏ ఒక్కదానికీ జవాబివ్వని పరిస్థితి ఉందని విమర్శించారు. మేం లేవనెత్తిన అంశలపై పలాయనం చిత్తగించడం కనిపిస్తోందని అన్నారు. ఎగవేతలు, ఎదురుదాడి, అబద్దాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చరిత్రలో ఇంత బాధ్యతారాహిత్యమైన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని అన్నారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి బాధ్యతారాహిత్యంగా మాట్లాడారని అన్నారు. ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతామని హెచ్చరించారు.

# 3,24,234 కోట్లు

**మొదటి పేజీ తరువాయి**
చదివే పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ పథకంలో భాగంగా పోషకాలతో కూడిన రాగిజావ, పాలు అందిస్తామని చెప్పారు.
ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరిస్తున్నట్టు ప్రకటించారు. ఇంటర్ చదివే వికలాంగ విద్యార్థులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాలను పంపిణీ చేస్తామన్నారు. పాఠశాలల్లో వంటశాలలను ఆధునీకరించేందుకు రూ.100 కోట్లు కేటాయించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రూ.1000 కోట్లు, వీరనారి చిట్యాల ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయానికి రూ.400 కోట్లు, మిగతా యూనివర్సిటీలకు కూడా బడ్జెట్‌లో కొంతమేర కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. గోదావరి పుష్కరాల కోసం రూ.500 కోట్లు కేటాయించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని శాసనసభలో మధ్యాహ్నం 12 గంటలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మండలిలో పౌరసంబంధాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రతిపాదించారు.
అనంతరం ఉభయ సభలు సోమవారం ఉదయం 10 గంటలకు వాయిదా పడ్డాయి. శాసనసభలో డిప్యూటీ సీఎం భట్టి బడ్జెట్‌పై ప్రసంగిస్తూడ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తున్నామనీ, ప్రతి పౌరునికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే తమ లక్ష్యమని నొక్కి చెప్పారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేసిపోయిందనీ, ఇప్పుడు తమ ప్రజా ప్రభుత్వం పాత అప్పులను, వాటి వడ్డీలను కట్టుకుంటూనే ఆర్థిక క్రమశిక్షణతో పాలనను గాడిన పెడుతున్న తీరును వివరించారు. తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలబెట్టడమే తమ లక్ష్యమనీ, సుస్థిరమైన అభివృద్ధి వైపునకు నడిపించేలా బడ్జెట్ రూపొందించామని తెలిపారు.

### తెలంగాణ వృద్ధిరేటు 10.7 శాతం
2025-26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి ప్రస్తుత ధరల ప్రకారం రూ.17, 82,198 కోట్లు అనీ, వృద్ధిరేటు 10.7 శాతంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇదే సమయంలో దేశ జీడీపీ రూ.3,57,13,886 కోట్లుగా ఉండగా వృద్ధిరేటు 8 శాతంగానే ఉందని చెప్పారు. దేశ జీడీపీలో రాష్ట్ర జీఎస్‌డీపీ 5 శాతం వాటా కలిగి దేశానికి బలమైన అభివృద్ధి యంత్రంలా ఉందన్నారు. 2024-25లో దేశ జీడీపీ వృద్ధిరేటు 9.8 శాతం ఉండగా 2025-26 నాటికి 8 శాతానికి పడిపోయిందనీ, అదే సందర్భంలో 2024-25లో తెలంగాణ రాష్ట్ర జీడీపీ వృద్ధి రేటు 10.6 శాతం ఉండగా ఈ ఏడాది 10.7 శాతానికి పెరిగిందని వివరించారు. తెలంగాణ ప్రజల తలసరి ఆదాయం రూ.4,18,931గా ఉందనీ, దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే 1.9 రెట్లు ఎక్కువ అని వివరించారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదగాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని చెప్పారు.

### సీఎస్ఎస్ నిధులపై దృష్టి
గత ప్రభుత్వం 2014 నుంచి 2023వరకు కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్) నిధులను రాబట్టడంలో విఫలమైందని డిప్యూటీ సీఎం భట్టి విమర్శించారు. తమ ప్రభుత్వం 2014-15 నుంచి 2023-24 వరకు సీఎస్ఎస్ కింద బకాయిపడ్డ రూ.3 వేల కోట్లను విడుదల చేసిందని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి రూ.7,072 కోట్లను రాబట్టామని చెప్పారు. మరింత చిత్తశుద్ధితో అధిక



నిధులు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామని హామీనిచ్చారు.

### రుణ పునర్వ్యవస్థీకరణతో నగదు వెసులుబాటు
గత ప్రభుత్వం అధిక వడ్డీకి తెచ్చిన రూ.25,612 కోట్ల రుణాలను తక్కువ వడ్డీకి పునర్వ్యవస్థీకరించామనీ, రుణ చెల్లింపుల వ్యవధిని పెంచి అసలు చెల్లించాల్సిన కాలాన్ని 20 ఏండ్ల నుంచి 39 ఏండ్లకు పొడిగించడంలో సక్సెస్ అయ్యామని భట్టి తెలిపారు. ఈ రుణ పునర్వ్యవస్థీకరణ ద్వారా 2025-26 నుంచి 2031-32 దాకా చెల్లించాల్సిన రూ.34,058 కోట్ల భారం కాస్తా రూ.11,915 కోట్లకు తగ్గిందని తెలిపారు. దాని ద్వారా రాష్ట్రానికి రూ.22, 142 కోట్ల క్యాష్ అవుట్ ఫ్లో తగ్గి నగదు వెసులుబాటు కలిగిందని చెప్పారు. ఈ ఏడాది రూ.27,988 కోట్ల అధిక వడ్డీ రుణాలను తక్కువ వడ్డీకి మార్చుకున్నామని తెలిపారు.

### రూపాయి పంపితే కేంద్రం ఇచ్చేది 42 పైసలే
కేంద్రానికి తెలంగాణ నుంచి రూపాయి పంపితే తిరిగి 42 పైసలే మనకు దక్కుతున్నదని భట్టి వివరించారు. జనాభా నియంత్రణ పాటిస్తూ, సొంత రాబడి పెంచుకుంటూ, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న రాష్ట్రాలకు ఈ పంపకం ద్వారా తీవ్ర అన్యాయం జరుగుతున్నదని 16వ ఆర్థిక సంఘం ముందు ఎత్తిచూపామన్నారు. రాష్ట్ర జీఎస్‌డీపీని కూడా కొలమానంగా తీసుకునేలా ఒప్పించామనీ, తెలంగాణ వాటాను 2.102 శాతం నుంచి 2.174 శాతానికి పెంచుకోవడంలో కొంతమేర సక్సెస్ అయ్యామని తెలిపారు.గ్లోబల్ సమ్మిట్ ద్వారా తెలంగాణ రైజింగ్ విజన్ -2047గ్లోబల్ సమ్మిట్ ఆధారంగానే తెలంగాణ రైజింగ్ విజన్-2047ని విడుదల చేశామని డిప్యూటీ సీఎం విక్రమార్క చెప్పారు. ఆ సమ్మిట్‌లో వందకుపైగా ఎంఓయూలు జరిగాయనీ, వాటి ద్వారా రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ లో 'నెక్స్ట్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-2030' ను ఆవిష్కరించారనీ, 2030 నాటికి పరిశోధనాభివృద్ధి, ఆధునిక తయారీ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలోనే మొదటి ఐదు స్థానాల్లో నిలపాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ఆ రంగంలో ఇప్పటిదాకా రూ.73,360 కోట్ల పెట్టుబడులను ఆకర్షించామనీ, ప్రత్యక్షంగా లక్ష మందికి, పరోక్షంగా 2.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. రానున్నకాలంలో సింగపూర్‌కు చెందిన ఏజీఐడీసీ, వియత్నాంకు చెందిన విన్ గ్రూప్, జేసీకే ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థల నుంచి 1,03, 500 కోట్ల పెట్టుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

### క్యూర్..ప్యూర్..రేర్
తెలంగాణను అభివృద్ధి చేసేందుకు రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా విభజించామని భట్టి తెలిపారు. క్యూర్‌లో సేవారంగానికి, ప్యూర్‌లో ఉత్పాదక రంగానికి, రేర్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని భట్టి అన్నారు. 30 వేల ఎకరాల్లో భూగర్భవిద్యుత్, పర్యావరణ అనుకూల స్మార్ట్ గ్రిడ్లతో భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేస్తున్నామనీ, దాన్ని ఏపీలోని మచిలీపట్నం పోర్టుతో అనుసంధానించేందుకు గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం జరుగుతున్నదని వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 67,763 ఉద్యోగాలను భర్తీ చేసి నియామక పత్రాలు అందజేశామని తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా 3.76 లక్షల మందికి కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను జారీ చేశామని ప్రకటించారు. జనగణనను డిజిటల్ విధానంలో చేయ బోతున్నామని తెలిపారు.
ఉచిత బస్సు ప్రయాణం ద్వారా తెలంగాణ ఆడబిడ్డలు రూ. 9,222 కోట్లు ఆదా చేసుకున్నారనీ, రూ.500కే గ్యాస్‌సిలిండ్ పథకం ద్వారా 43 లక్షల కుటుంబాలకు రూ.752 కోట్లు, ఉచిత కరెంటు ద్వారా పేదలకు రూ. 3,954 కోట్లు ఆదా అయ్యాయని వివరించారు. మహిళా శక్తి మిషన్ ద్వారా మహిళలకు ఐదేండ్లలో లక్ష కోట్ల రూపాయలు ఇప్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామనీ, ఇప్పటికే 57, 938 కోట్ల రూపాయల రుణం ఇప్పించామని తెలిపారు. 1,329 కోట్ల వడ్డీ రాయితీ విడుదల చేశామని చెప్పారు. ఇందిర సౌర గిరి జలవికాసం పథకం కింద ఎస్టీలకు 12,600 కోట్ల బడ్జెట్‌తో వంద శాతం సబ్సిడీ కింద సోలార్ పంపు సెట్లను అందిస్తామనీ, 6 లక్షల ఎకరాల పోడు భూములలో అటవీ ఉత్పత్తులకు సంబంధించిన తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు. ఇప్పటికే అచ్చంపేటలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామనీ, విధివిధానాలు రూపొందించి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని ప్రకటించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
శనివారం 21 మార్చి 2026

# ఆరు గ్యారంటీలను అమలు చేయాలని బీఆర్ఎస్ నిరసన

**గన్ పార్క్ అమరవీరుల స్థూపం నుండి అసెంబ్లీ వరకు బీఆర్ఎస్ నిరసన ర్యాలీ..**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు..**

**నిరసన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.. ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు..**





**ప్రజావినికిడి,(హైదరాబాద్):** కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని బాండ్ పేపర్లు ఇచ్చి,గ్యారంటీ కార్డులు పంచి,గెలిచాక అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ వంచిస్తోందని,హామీలను ఎగ్గొట్టి,అబద్ధాలను ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో నిలదీస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గన్ పార్క్ అమరవీరుల స్థూపం నుండి అసెంబ్లీ వరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు,అదేవిదంగా ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి గన్ పార్క్ నుండి అసెంబ్లీ వరకు ఆరు గ్యారంటీలను అమలు చేయాలని నిరసన ర్యాలీ నిర్వహించారు.

# ఉగాది సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను కలిసిన కాంగ్రెస్ శ్రేణులు

**ప్రజావినికిడి, (రాజేంద్రనగర్): మార్చి 20,** ఉగాది పండుగ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ని రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని లోని చౌదర్ గూడ గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు తాళ్ళ శ్రీనివాస్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కమ్మదనం వినోద్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి ఉగాది పర్వదినం శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు శాలువా కప్పి,పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ,శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది పర్వదినం శుభాకాంక్షలు తెలిపారు.ఉగాది పండుగ తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు.కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలందరికీ ఆరోగ్యం, ఆయుష్షు, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు,కొత్త ఆరంభాలు కలగాలని,గత సంవత్సరంలోని కష్టాలను అధిగమించి ఈ సంవత్సరం విజయాల బాటలో నడవాలని కోరారు.రైతులు పంటలతో సిరిసంపదలు సాధించాలని, యువత తమ లక్ష్యాలను చేరుకోవాలని, మహిళలు అన్ని రంగాల్లో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని, ప్రజల సహకారంతో సంక్షేమ కార్యక్రమాలు మరింత బలోపేతం అవుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.



# సర్వే ద్వారా సమస్యను స్నేహపూర్వకంగా పరిష్కరించుకోవాలి..

**మాది కుటుంబ వివాదం రాజకీయ నేతల ప్రమేయం లేదు..**





**ప్రజావినికిడి, (గండిపేట):** గండిపేట మండల పరిధిలోని వట్టినాగులపల్లి ప్రాంతంలోని సర్వే నంబర్లు 259,245 మధ్య సుమారు 2 ఎకరాల భూమిపై కుటుంబ సభ్యుల మధ్య వివాదం నెలకొంది.ఈ విషయం ప్రస్తుతం కోర్టులో విచారణలో (సబ్‌జ్యుడిస్) ఉండగా,ఇరు పక్షాలు కోర్టు ఆదేశాల కోసం వేచి ఉన్నాయి.ఓ పక్షంకు చెందిన అక్షయ్ షా, అవినయ్ షా, సతీష్ షా తెలిపిన వివరాల ప్రకారం.. ఏడి సర్వే ద్వారా సర్వే నెం.245 పక్కన ఉన్న 3.5 ఎకరాల భూమిపై తమ హక్కులు ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని పేర్కొన్నారు. అయితే సర్వే నంబర్ 245 యజమానులు అనుమతి లేకుండా అక్రమంగా కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టి సుమారు 2 ఎకరాల భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా,కోర్టు కేసులో పేర్కొన్నట్లుగా సర్వే నెం.245 భూమి సరిహద్దులు స్పష్టంగా గుర్తించలేనివిగా ఉన్నాయని తెలిపారు.ఈ భూమిని అభివృద్ధి చేయడానికి “న్యూజెన్” అనే డెవలపర్ ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది. అయితే వివాదం పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు అభివృద్ధి పనులు చేపట్టడం సాధ్యం కాదన్నారు. సమస్యను రాజకీయ రంగంలోకి తేకుండా,కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఇరు పక్షాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సంయుక్త సర్వే ద్వారా సమస్యను స్నేహపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచిస్తూ, సర్వే నం.245 యజమానులు ఈ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని కోరారు.

# రంజాన్ మాసం చాలా పవిత్రమైనది

**ఎన్టీఆర్ నగర్ లో డీసీసీ జనరల్ సెక్రటరి హర్షలత ఆధ్వర్యంలో దవాత్- ఏ- ఇఫ్తార్ విందు**





**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):** రంజాన్ మాసం పర్వదినం ను పురస్కరించుకుని మహేశ్వరం నియోజకవర్గం ఎన్టీఆర్ నగర్ డివిజన్ లో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తమలపాకుల హర్షలత ఆధ్వర్యంలో దవాత్- ఏ - ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యాక్షులు జల్ పల్లి నరేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, రంజాన్ మాసం చాలా పవిత్రమైనది అని, రంజాన్ మాసం సందర్భంగా నిష్టతో పాటించే ఉపవాస దీక్షలు,దైవ ప్రార్థనలతో సామరస్యం,శాంతి సాభ్రాతత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రంజాన్ పర్వదినం ను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం చాలా అభినదించదగ్గ విషయం అన్నారు. రంజాన్ పండుగ ప్రజా జీవితాల్లో సుఖ సంతోషాలను అందించాలని అభిలషించారు. రంజాన్ మాసం ఉపవాసం తో మంచి తనం సంస్కారం అలవమతుందని, మతసామరస్యానికి ప్రతీక అందరూ కలిసి ఉండాలని ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టడం పెట్టినట్లు తెలిపారు. ముస్లింల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు.ఈ విధమైన ఆధ్యాత్మిక దైవ ప్రార్థనలతో శాంతి, సోదరబాదం. సౌభ్రాతృత్వానికి రంజాన్ ప్రతీక అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాజ్ కుమార్,సరూర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్ యాదవ్,ఎన్టీఆర్ నగర్ బస్తీ వాసులు రాజు నాయక్, ఎంఎం మమ్మద్ ఆలీ,అస్లాం లాలు,ముస్లిం మత పెద్దలు. ముస్లిం సోదరులు పాల్గొన్నారు.రైటర్: -ఎన్టీఆర్ నగర్ లో నిర్వహించిన దవాత్-ఏ ఇఫ్తార్ విందులో పాల్గొన్న జల్ పల్లి నరేందర్, హర్షిలత,మైనార్టీ నాయకులు..

# తెలంగాణ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ ను కలిసిన మధుయాష్కి గౌడ్..భట్టి విక్రమార్క..




**ప్రజావినికిడి,(హైదరాబాద్):** ఏఐసిసి తెలంగాణ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ ని ఎమ్మెల్యే క్వార్టర్స్ లో శుక్రవారం రోజు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా అక్కడ కలిసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ,పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి , మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్,మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తోనూ మాట్లాడారు. ప్రభుత్వ విప్ లుగా నియమితులైన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ కు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.



# ఆరు గ్యారెంటీలు,ఎన్నికల మేనిఫెస్టో అమలు చేయండి

**కొందుర్గు తహసిల్దార్ కి వినతి పత్రం అందజేత**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను, ఇతర హామీలను తక్షణమే అమలు చేయాలని భారతీయ జనతా పార్టీ కొందుర్గ్ మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల రెవెన్యూ అధికారి తహసిల్దార్ కు బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.యువ వికాసం జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి,మహాలక్ష్మి పథకం,కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం వంటి కీలక హామీలు ఇప్పటికీ కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. రైతు భరోసా అందక,రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పెట్టుబడి కోసం మళ్ళీ అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వృద్ధులు,వితంతువులు, దివ్యాంగులకు రావాల్సిన కొత్త పించన్లను వెంటనే మంజూరు చేయాలని,అలాగే అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో నిర్వహించిన ‘ప్రజాపాలన’లో సమర్పించిన దరఖాస్తులపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు (డ్రైనేజీ,సిసి రోడ్లు) అధ్వాన్నంగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు,సామాన్యులకు అవసరమైన ఆదాయ,కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని కోరారు.ప్రభుత్వం స్పందించి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని,లేనిపక్షంలో బీజేపీ తరపున పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చెంది మహేందర్ రెడ్డి, కందూరి మనోహర్ రెడ్డి,బోయ శంకర్, కొమరబండ శ్రీశైలం, శివారెడ్డి,సున్నాల అంజయ్య,కార్తీక్ యాదవ్,వెంకట్ రెడ్డి,చంద్రశేఖర్ చారి, కాటంరాజు గౌడ్, నర్సింలు,శ్రీనివాస్, రఘునాథ్ రెడ్డి, వీరయ్య, యాదగిరి యాదయ్య,నవీన్,జి.బి.శేఖర్, వెంకటేష్,కార్యకర్తలు పాల్గొన్నారు.

# 31ఎకరాల భూదాన భూములను పేదలకు పంపిణి చేయండి



**ప్రజావినికిడి, (హిమాయత్ నగర్):** రాష్ట్రంలో 1.59.000 ఎకరాల భూదాన భూములు నిరుపయోగంగా పడి ఉన్నాయని, అవి భూమిలేని నిరుపేదలకు చెందవలసినవని, వాటిని వెంటనే నిరుపేదలకు పంపిణి చేయాలనీ సీనియర్ సిపిఐ, మాజీ ఎంపీ సయ్యిద్ అజీజ్ పాశ,సిపిఐ జాతీయ నాయకులూ, మాజీ ఎమ్యెల్యే చాడ వెంకట్ రెడ్డి, తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షులు ఆర్.శంకర్ నాయక్ లు రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్,రాష్ట్ర సంచివాలయంలో శుక్రవారం వారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలసి వినతి పత్రం అందజేసి అప్పటి హైదరాబాద్ రాష్ట్రంలో భూమిలేని నిరుపేదలకు పంచేందుకు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ఆచార్య వినోబా భావే భూస్వాముల నుండి సేకరించిన దాదాపు 1,79,000 ఎకరాల భూమి అప్పట్లో కొద్ది మంది నిరుపేదలకు పంచగా మిగితా భూములు కొంత మేరకు అన్యాక్రాంతమైన చాలా వరకు నేటికీ ఖాళీగానే ఉన్నాయని, ఈ భూదాన భూములు నిరుపేదలకు చెందవలసినవని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఈ భూములను పేదలకు పంపిణి చేసిందని అన్నారు.ఇప్పుడు కూడా ఈ కాంగ్రెస్ ప్రభుత్వమే ఈ భూములను పేదలకు పంపిణి చేయాలని కోరారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ లో సర్వే నెంబర్ 88, 89 లో ఉన్న 31 ఎకరాల భూదాన భూములను సామజిక -ఆర్థిక సర్వే చేసి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలో ఉన్న దాదాపు 1500 మంది ఇళ్లులేని నిరుపేదలకు పట్టాలు పంపిణి చేయాలనీ కోరారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఈ భూములలో కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ భూములను గూడులేని పేదలకు పంపిణీ చేయాలని చెప్పారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమైన భూదాన భూములను స్వాధీనం చేసుకొని ప్రభుత్వం అధీనంలో పెట్టుకోవాలని, అఖిల భారత సర్వ సేవా సంఘం చేసిన సిఫార్సుల మేరకు భూదాన యజ్ఞ బోర్డు ను ఏర్పాటు చేసి మొత్తం భూదాన భూములను పేదలకు పంపిణి చేయాలని వారు మంత్రి కి విజ్ఞప్తి చేశారు.

# లేగ దూడల పై కుక్కల దాడి..

## నిత్యం ఏదో ఒక వీధిలో..ఎవరో ఒకరు కుక్క కాటుకు గురి..



**ప్రజావినికిడి, (శంషాబాద్): మార్చ్ 20,** పొలం వద్ద ఉన్న లేగ దూడల పై వీధి కుక్కలు దాడి చేయడంతో లేగ దూడల మృతి చెందిన ఘటన శంషాబాద్ మండలం చౌదర్ గూడ లో చోటు చేసుకుంది.గత కొన్ని రోజుల నుండి వీధి కుక్కల స్వైర విహారం వీధుల్లో జరుగుతూనే ఉంది ఆడుకునే చిన్నారులపై,వృద్ధులపై విచక్షణారహితంగా దాడి చేసిన వీధి కుక్కలు ఇప్పుడు పశువులపై కూడా దాడి చేస్తున్నాయి. తాజాగా రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పరిధిలోని చౌదర్ గూడ గ్రామానికి చెందిన మల్చలం మహేష్ గేదెలు పెంచుతూ వాటి తో వచ్చే పాల వ్యాపారం చేసుకుని జీవనం గడుపుతున్నాడు. గురువారం ఉదయం పొలం వద్ద ఫామ్ హౌస్ లో లేగ దూడలను కట్టేసి గేదలను మేత కోసం బయటకు తీసుకెళ్లాడు. మధ్యాహ్నం తన పొలంలో ఫామ్ దగ్గరకి గేదెలను తీసుకొని వెళ్ళాడు.అక్కడ లేగ దూడలను నాలుగు వీధి కుక్కలు దాడి చేసి చంపి తింటుండగా చూసి కుక్కలను తరిమికొట్టాడు. అప్పటికే లేగ దూడ చనిపోయినట్టు అయన గుర్తించాడు.పొలం పనులు చేసుకుంటూ పాల వ్యాపారం చేసుకుని జీవించే వీరు..లేగ దూడ మృతి చెందడంతో అయన కన్నీటి పర్యాంతమయ్యారు.గత పది రోజుల కిందట చౌదర్ గూడ గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు కుడా వీధి కుక్క దాడికి గురయ్యారు.గత నాలుగు రోజుల క్రిందట చౌదర్ గూడ పక్కన ఉన్న నర్కుడ గ్రామానికి చెందిన ఓ రైతు శనివారం రాత్రి పొలం వద్ద పాడి గేదెలను లేగ దూడలను కట్టేసి ఇంటికి వెళ్లి ఆదివారం ఉదయం పొలానికి వేళ్లే సరికి వీది కుక్కలు నాలుగు లేగ దూడలను పై దాడి చేసి చంపడం జరిగింది. నిత్యం ఏదో ఒక వీధిలో,ఎవరో ఒకరు కుక్క కాటుకు గురవుతూనే ఉన్నారు.చిన్న పిల్లలు,పెద్దలు అని తేడా



లేకుండా కనిపించిన వారిని కనిపించిన చోట పగబట్టినట్టే వీధి కుక్కలు వెంటాడుతూనే ఉన్నాయి, కరుస్తూనే ఉన్నాయి.మరి ఈ సమస్యలకు అంతమే లేదా. పరిష్కార మార్గాలు తెలిసినా,ఎందుకు వీధి కుక్కలను అరికట్టలేకపోతున్నారు. అసలు లోపం ఎక్కడుంది ఏం చేస్తే ఈ సమస్య నుంచి ప్రజలను కాపాడవచ్చు.
అధికారులు ఇప్పటికైనా కళ్ళు తెరిచి వీధి కుక్కలను పూర్తిగా పట్టుకుని ఇక్కడి నుంచి తరలించాలని కోరారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ చైర్ పర్సన్ గా మహిళలకు ప్రాధాన్యతనివ్వాలి



**ప్రజావినికిడి, (ఆబిడ్స్):** బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్,బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాల కమిటీ చైర్ పర్సన్ గా మహిళలకు ప్రత్యేకించి మాల మహిళలకు ప్రాధాన్యతనివ్వాలని మాల ప్రజా ఫ్రంట్ చైర్మన్, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ మంచాల లింగస్వామి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మాల ప్రజా ఫ్రంట్, జై భీమ్ మహిళా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బషీర్బాగ్ ప్రెస్ క్లబ్బులో విలేకర్ల సమావేశం లో వారు మాట్లాడారు. వచ్చే ఏప్రిల్ లో నిర్వహించబోయే బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్,బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాల నిర్వహణ కమిటీ చైర్ పర్సన్ గా మహిళలకు ప్రత్యేకించి మాల మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.మహిళా అభివృద్ధి దేశాభివృద్ధి అని పునరుద్ఘాటించిన అంబేద్కర్ ఆశయాలను తుంగలో తొక్కుతూ ప్రతి సంవత్సరం జయంతి ఉత్సవాల కమిటీ చైర్ పర్సన్ గా పురుషులకే పదవులు కట్టబెడుతున్నారు. మహిళాభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్నామని చెబుతున్న ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారైనా జయంతి ఉత్సవాల కమిటీ చైర్ పర్సన్ గా మహిళలకు అవకాశం ఇవ్వాలని అన్నారు.మాటల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్న ప్రస్తుత ప్రభుత్వం చేతల్లో కూడా మహిళలకు ప్రాధాన్యత ఇచ్చి నిరూపించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జాతీయ షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం వైస్ ప్రెసిడెంట్ కే. ఉమాకాంత్, ఆదర్శ మహిళా సేవా సంఘం నాయకురాలు లావణ్య, తెలంగాణ మహిళా సంక్షేమ జై భీమ్ మహిళా వెల్ఫర్ అసోసియేషన్ నాయకురాలు రాజమణి,మాల మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు సౌభాగ్య,దాసరి విశాల్,పుణ్య భాను ప్రకాష్, విజయలక్ష్మి, కడారం వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## త్రిణయ ఆరోగ్య కేంద్రంను ప్రారంభించిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్

**ప్రజావినికిడి, (బంజారాహిల్స్):**



120 ఏళ్ల అపూర్వ వైద్య వారసత్వాన్ని కలిగిన ఆర్య వైద్యశాల, కొట్టక్కల్ హైదరాబాద్లో తన ఆధునిక ఆరోగ్య విభాగం "త్రిణయ ఆరోగ్య-చికిత్స కేంద్రం"ను బంజారా హిల్స్లోని హుడా రెసిడెన్షియల్ కాంప్లెక్స్లో ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ దామోదర రాజనరసింహ, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్ కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భారత దేశంలో ఆయుర్వేదానికి ఎంతో ప్రాచుర్యం ఉందని అన్నారు. నాడు పూర్వీకులు ఆయుర్వేద విధానాన్నే ఆవలంబించేదని గుర్తు చేశారు. నేడు ఈ ఆస్పత్రి ద్వారా ఆయుర్వేద చికిత్సను అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలు ఈ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.చర్మం, కేశ సంరక్షణలో కూడా ప్రామాణిక ఆయుర్వేద చికిత్సలు అందించడం ఈ కేంద్రం ప్రత్యేకత అని సంప్రదాయం, శాస్త్రీయ విధానం, ఆధునిక సదుపాయాల సమ్మేళనంతో పట్టణ ప్రజలకు సమగ్ర ఆరోగ్య పరిష్కారాలను అందించడమే ప్రధాన ఉద్దేశమని మేనేజింగ్ ట్రస్టీ డా.పి.ఎం. వారియర్ తెలిపారు. హైదరాబాద్లో త్రిణయ కేంద్రం ప్రారంభం ద్వారా ఆయుర్వేద సంప్రదాయాన్ని మరింత విస్తరించి, సమకాలీన అవసరాలకు అనుగుణంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో ఆయుర్వేదం వైద్యశాల మరో ముందడుగు వేసిందన్నారు. త్రిణయ అనగా సంప్రదాయం, శాస్త్రం,ఆధునికత కలయికతో సంపూర్ణ ఆరోగ్యానికి కొత్త దిశా మార్గదర్శకమని అన్నారు.ఆర్య వైద్యశాల మేనేజింగ్ ట్రస్టీ డా. పి.ఎం. వారియర్, ప్రధాన కార్యనిర్వాహక అధికారి కె. హరికుమార్,డా. కె.మురళీధరన్, ఆయుర్వేద ఆసుపత్రి పరిశోధనా కేంద్రం సూపరింటెండెంట్ మనోహర్ బండ్ల, వై యు పి రైట్కేర్ ప్రతినిధి పి.ఎస్. వరప్రసాద్ పాల్గొన్నారు.

## శామ్యూల్ పై జరిగిన దాడిని ఖండించిన మాదిగ జాగృతి

**ప్రజావినికిడి, (ఆబిడ్స్):**



తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామ్యూల్ ను తీవ్ర పదజాలంతో దూషిస్తూ.. నివాసంపై జరిగిన దాడి ఘటనలను మాదిగ జాగృతి సంఘం తీవ్రంగా ఖండించింది. శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాదిగ జాగృతి సంఘం నాయకులు భీమ్ రావు,లింగస్వామి లు మాట్లాడుతూ,ఒక అధికార పార్టీ దళిత ఎమ్మెల్యే కి ఇంత ఘోరమైన అవమానం జరుగుతుంటే ముఖ్యమంత్రి స్పందించకపోవడం చాలా దారుణమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మందుల శామ్యూల్ తగిన భద్రత కల్పించడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో మల్లేష్,శివరాజ్, రవి,రమేష్ తదితరులు పాల్గొన్నారు.ి

## తెలంగాణ బడ్జెట్ సామాజిక న్యాయానికి నిదర్శనం

### మాజీ జడ్పీటిసి విశాల శ్రవణ్ రెడ్డి



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**రాష్ట్ర అభివృద్ధి,ప్రజా ప్రయోజనాలే పరమావధిగా సాగుతున్న ప్రజా ప్రభుత్వంలో 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సామాజిక,ఆర్థిక,రాజకీయ న్యాయం దిశగా వేసిన బలమైన ముందడుగు అని కేశంపేట మాజీ జడ్పీటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి కొనియాడారు.ప్రజల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో బడ్జెట్ను రూపొందించిన కాంగ్రెస్ నాయకత్వానికి ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఆర్థిక మందగమనం ఉన్నప్పటికీ తెలంగాణ అద్భుతమైన ప్రగతిని సాధించిందని పేర్కొన్నారు. దేశ జీడీపీ వృద్ధి రేటు 9.8 శాతం నుండి 8 శాతానికి పడిపోయినప్పటికీ,తెలంగాణ వృద్ధి రేటు 10.6 శాతం నుండి 10.7 శాతానికి పెరగడం ప్రభుత్వ సమర్థతకు నిదర్శనమన్నారు. ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర జీఎస్డీపీ 17,82,198 కోట్ల రూపాయలకు చేరిందని వెల్లడించారు.దేశ సగటు వృద్ధి రేటు కంటే తెలంగాణ 2.7 శాతం అధిక వృద్ధిని నమోదు చేస్తూ,దేశ జీడీపీలో 5 శాతం వాటాతో బలమైన 'గ్రోత్ ఇంజిన్'గా నిలిచిందని ఆమె వివరించారు. ?ప్రజలు చెల్లించే ప్రతి పైసాకు కాపలాదారులుగా ఉంటూ,వారి అభ్యున్నతి కోసమే ఈ బడ్జెట్ను రూపొందించారని తెలిపారు.రికార్డు స్థాయి పెట్టుబడులను ఆకర్షిస్తూ తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, ప్రభుత్వ ఆర్థిక విధానాలు సరైన దిశలో సాగుతున్నాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

# వర్టెక్స్ 33 వెస్ట్‌లో అద్భుతమైన అవకాశం

### ఆఫర్ ఏప్రిల్ 15 వరకు



**ప్రజావినికిడి, (గచ్చీ బౌలి):**
పశ్చిమ కారిడార్లో గృహ కొనుగోలుదారులకు ప్రస్తుతం అరుదైన అవకాశంగా మారింది వర్టెక్స్ 33 వెస్ట్ ప్రాజెక్ట్. వేగంగా అభివృద్ధి చెందుతున్న నల్లగండ్ల--గచ్చిబౌలి ప్రాంతంలో ఉన్న ఈ ప్రాజెక్ట్ నిర్మాణ పురోగతి మరియు ఆర్థిక సౌలభ్యం రెండింటినీ సమన్వయం చేస్తూ కొనుగోలుదారుల దృష్టిని ఆకర్షిస్తోంది.ప్రస్తుత కాలంలో గృహ కొనుగోలు నిర్ణయం తీసుకునే ముందు ఆర్థిక ప్రణాళికతో పాటు ప్రాజెక్ట్ నమ్మకాన్ని కూడా పరిశీలించే పరిస్థితుల్లో,ఈ ప్రాజెక్ట్ ఒక ప్రత్యేక ఆఫర్ను ప్రకటించింది. జనవరి 2027 వరకు ఈఎంఐ హాలిడే అందించడంద్వారాకొనుగోలుదారులు ఇప్పుడే ఇంటిని బుక్ చేసుకుని, నిర్మాణ దశలో ఈఎంఐ భారం లేకుండా ముందుకు సాగేందుకు అవకాశం కల్పిస్తోంది.ఈ ఆఫర్ ఏప్రిల్ 15, 2026 వరకు మాత్రమే చెల్లుబాటు కావడంతో, కొనుగోలుదారులు తమ ఆర్థిక ప్రణాళికను సౌకర్యంగా నిర్వహించుకునే సమయం పొందుతారు.నిర్మాణ పురోగతి ముందంజలోప్రాజెక్ట్ విశ్వసనీయతను పెంచుతున్న ముఖ్య అంశం నిర్మాణ వేగం. 2023 ఆగస్టులో అన్ని అనుమతులు పొందిన ఈ ప్రాజెక్ట్, 2024 జనవరిలో ఫౌండేషన్ పనులు ప్రారంభించింది. తక్కువ సమయంలోనే రెండు టవర్స్ 33 అంతస్తుల నిర్మాణాన్ని పూర్తి చేయడం ప్రణాళిక మరియు అమలు సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోంది.ప్రస్తుతం ఇంటీరియర్ పనులు,ఫసాడ్ ట్రీట్మెంట్,బిల్డింగ్ సర్వీసెస్ పనులు సమాంతరంగా కొనసాగుతున్నాయి.పోడియం నిర్మాణం ఇప్పటికే కనిపించడం ప్రాజెక్ట్ వేగాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది.పోడియం లైఫ్‌స్టైల్ కాన్సెప్ట్
ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకతలలో ఒకటి పూర్తి స్థాయి పోడియం కాన్సెప్ట్. నల్లగండ్ల--గచ్చిబౌలి ప్రాంతంలో ఇది అరుదుగా కనిపించే సదుపాయం. ఎలివేటెడ్ పోడియం ద్వారా ట్రాఫిక్ రహిత వాతావరణం ఏర్పడి, నివాసితులకు భద్రతతో పాటు మెరుగైన జీవన ప్రమాణాలు అందిస్తుంది.విశాలత అలాగే ప్రైవసీకి ప్రాధాన్యంకేవలం రెండు టవర్స్‌తో లో డెన్సిటీ ప్లానింగ్ చేయడం ద్వారా విశాలమైన జీవన స్థలాన్ని అందిస్తోంది.ప్రతి అపార్ట్‌మెంట్‌లో మూడు బాల్కనీలు ఉండేలా డిజైన్ చేయడం వల్ల గాలి,వెలుతురు సమృద్ధిగా అందుతుంది.గ్లాస్ రైలింగ్స్‌తో ఆధునిక లుక్‌ను కూడా కల్పించారు.భద్రత కోసం బయోమెట్రిక్ లాక్స్, ఇంటీరియర్స్‌లో పెద్ద టైల్స్ వంటి ఫీచర్లు వినియోగదారుల సౌకర్యాన్నిపెంచుతాయి.నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ అపార్ట్‌మెంట్స్‌లో ఆల్ ఇంటర్నేషనల్ బ్రాండ్స్‌కు చెందిన ఫిట్టింగ్స్ వినియోగించడం ద్వారా నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. అందమైన డిజైన్‌తో పాటు దీర్ఘకాలిక ఉపయోగం, తక్కువ నిర్వహణ అవసరం ఉండేలా స్పెసిఫికేషన్స్ రూపొందించారు. అభివృద్ధి దిశగా ముందుకునల్లగండ్ల--గచ్చిబౌలి ప్రాంతంలో సుమారు 43 ఎకరాల్లో అభివృద్ధి జరుగుతున్న ప్రాజెక్ట్‌లు ఉండటం డెవలపర్ యొక్క దీర్ఘకాల దృష్టిని తెలియజేస్తోంది. ఐటి హబ్‌లకు సమీపంలో ఉండటం వల్ల ఈ ప్రాంతానికి భవిష్యత్‌లో మరింత డిమాండ్ పెరగనుంది.అద్భుతమైన అవకాశంనిర్మాణం వేగంగా కొనసాగుతుండటం,జనవరి 2027 వరకు ఈ ఎం ఐ హాలిడే వంటి సౌకర్యం కలగడం వల్ల ప్రస్తుత సమయం కొనుగోలుదారులకు అనుకూలంగా మారింది.అయితే ఈ ఆఫర్ ఏప్రిల్ 15 వరకు మాత్రమేఅందుబాటులో ఉండటంతో, ఇది ఒక పరిమిత కాల వ్యూహాత్మక అవకాశం అని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో నమ్మకం, పారదర్శకత, సమయానికి నిర్మాణం ముఖ్యమైన అంశాలుగా మారిన నేపథ్యంలో,వర్టెక్స్ 33 వెస్ట్ ప్రాజెక్ట్ ఈమూడు అంశాలనుసమన్వయంచేస్తూగృహకొనుగోలుదారులకు ఆకర్షణీయ ఎంపికగా నిలుస్తోంది.

# బడ్జెట్ లో జర్నలిస్టులకు మొండి చెయ్యి..

## జర్నలిస్టుల పట్ల వివక్ష తగదు.. -టీడబ్ల్యూజేఎఫ్ నేత మామిడి సోమయ్య..

**ప్రజావినికిడి,(హైదరాబాద్): మార్చి 20:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో జర్నలిస్టుల సంక్షేమానికి ఎటువంటి కేటాయింపులు చేయకుండా మొండి చేయి చూపిందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు పెద్ద ఎత్తున బడ్జెట్ కేటాయింపులు చేసిన ప్రభుత్వం జర్నలిస్టులకు సంబంధించి ఎటువంటి ప్రస్తావన చేయకపోవడం, నిధులు కేటాయించకపోవడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు.గత రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులను విస్మరించిందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ను పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటిదాకా చిన్న మధ్యతర పత్రికలకు ఇచ్చిన అడ్వర్టైజ్మెంట్ల బిల్లులు కూడా చెల్లించకపోవడం విచారకరమని అదే విధంగా మీడియా అకాడమీకి బడ్జెట్లో ఏమి చెప్పలేదని ఆయన తెలిపారు. బడ్జెట్ లో నిధులు కేటాయించకుండా జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమాలను ఎలా అమలు చేస్తారని,ఇండ్ల స్థలాలు,హెల్త్ కార్డులు,సంక్షేమ కార్యక్రమాల అంశాలేమీ చెప్పలేదని అన్నారు. ప్రభుత్వం వచ్చిన తరువాత జర్నలిస్టులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని, కనీసం కొత్త అక్రిడిటేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని అన్నారు. చనిపోయిన జర్నలిస్టులకు ఇచ్చే ఆర్థిక సహాయం పెంచాలని ఇళ్ల స్థలాలు కేటాయించాలని హెల్త్ కార్డులు ఇవ్వాలని గత రెండేళ్లుగా తాము ప్రభుత్వాన్ని పదేపదే కోరుతున్నప్పటికీ ప్రభుత్వం తమ డిమాండ్లను పెడచెవిన పెడుతూ జర్నలిస్టులను నిర్లక్ష్యం చేస్తుందని ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఈ బడ్జెట్ పై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమాజం దృష్టికి తీసుకుపోతున్న మీడియా పట్ల పాలకులు పూర్తి నిర్లక్ష్యం వహించడం సహించరానిదని, తక్షణమే జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల నిరసన తెలియజేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

# రోజువారి కూలీలకు వడదెబ్బ తగలకుండా మెడికల్ చూచనలు





**ప్రజావినికిడి,(వాజేడు):**
పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వ్యవసాయ క్షేత్రాలలో డాక్టర్ తరుణ్ ఆధ్వర్యంలో వడదెబ్బ, వడగాలుల గురించి వలస కూలీలకు వివరించుట జరిగినది

**ముఖ్యంగా ఈ క్రింది లక్షణాలు ఉంటే**
అయోమయం గందరగోళం ఆందోళన చిరాకు మూర్చ లేదా కోమ వేడి,ఎరుపు మరియు పొడి చర్మం తలనొప్పి కండరాల బలహీనత లేదా తిమ్మిరి వికారము మరియు వాంతులు హృదయ స్పందనలు పెరగడం శ్వాస పెరగడం ఈ విధంగా లక్షణాలు కలిగి ఉంటారు అని వివరించారు

**చేయకూడనివి**
మధ్యాహ్నం 12 లేదా మూడు గంటల మధ్య ఎండలో బయటకు రాకూడదు మధ్యాహ్నం బయట ఉన్నప్పుడు శరీర కష్టంతో కూడిన కార్యకర్తలకు దూరంగా ఉండాలి చెప్పులు లేకుండా బయటకు వెళ్ళవద్దు ఆల్కహాల్ టీ కాఫీ మరియు కార్బోనేటెడ్ శీతల పానీయాలు లేదా పెద్ద మొత్తంలో చక్కెరతో కూడిన పానీయాలు నివారించాలి అధిక మాంసం కృతులు కలిగిన ఆహారాన్ని తినవద్దు అలాగే నిల్వ ఆహారాన్ని తినవద్దు నిలిపిన ఉంచిన వాహనంలో పిల్లలు లేదా పెంపుడు జంతువులను వదిలివేయవద్దు వాహనం లోపల ఉష్ణోగ్రత పెరిగి ప్రమాదకరంగా మారవచ్చు అని వివరించారు మీరు

చేయవలసినవి మీకు దాహం వేయకపోయినా వీలైనప్పుడల్లా తగినంత నీరు త్రాగండి దాహం డిహైడ్రేషన్ కి మంచి సూచిక కాదు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు ఉపయోగించాలి నిమ్మరసం మజ్జిగ పండ్ల రసాల వంటి ఇంట్లో తయారు చేసిన పానీయాలు కొద్దిగా ఉప్పు కలిపి త్రాగాలి పుచ్చకాయ కర్బూజా ఆరెంజ్ ద్రాక్ష పైనాపిల్ దోసకాయ పాలకూర లేదా ఇతర స్థానికంగా లభించే పండ్లు లేదా కూరగాయలు వంటి అధిక నీటి పరిమాణం కలిగిన ఉన్న సీజనల్ పండ్లు లేదా కూరగాయలు తినాలి సన్నని వదులుగా లేదా లేత రంగులో ఉండే కాటన్ వస్త్రాలం ధరించడం మంచిది మీ తలను కప్పుకోండి సూర్యరశ్మికి నేరుగా బహిర్గతమయ్యే సమయంలో గొడుగు టోపీ టవల్ అదేవిదంగా ఇతర సంప్రదాయ తలపాకలు ఉపయోగించాలి. ముఖ్యంగా వడదెబ్బకు గురయ్యే వర్గాలు శిశువు,చిన్నపిల్లల గర్భిణీ స్త్రీలు ఆరుబైట పనిచేసే వ్యక్తులు మానసిక వ్యాధి ఉన్న వ్యక్తులు శారీరకంగా అనారోగ్యంతో ఉన్న వ్యక్తులు ముఖ్యంగా గుండె జబ్బులు లేదా అధిక రక్తపోటు ఉన్నవారు చల్లటి వాతావరణం నుండి వేడి వాతావరణం వచ్చే వ్యక్తులు అలాంటి వ్యక్తులు వడగాలులు సమయంలో బయట సందర్శిస్తున్నట్లయితే వారి శరీరాలు వేడికి అలవాటు పడటానికి ఒక వారం సమయం పడుతుంది దీనికోసం పుష్కలంగా నీరు త్రాగాలి వేడి వాతావరణం అలవాటు పడటానికి శారీరక కార్యకలాపాలను క్రమంగా పెంచడం ద్వారా ఈ పరిస్థితికి అలవాటు పడవచ్చు ఈ విధమైన సూచనలు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో డాక్టర్ తరుణ్,ఎచ్ఈఓ వేణుగోపాలకృష్ణ , ఎచ్ఎ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుడి శోభాయాత్రలో పాల్గొనడం అదృష్టం

## షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 27న షాద్ నగర్ లో శోభాయాత్ర..



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**షాద్ నగర్ హిందూ వాహిని ఆధ్వర్యంలో ఈనెల 27న శ్రీరామనవమి రోజున జరిగే శ్రీరామ శోభాయాత్రకు హిందూ వాహిని సభ్యులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను ఆహ్వానించారు. ఎమ్మెల్యే తో పాటు మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, కౌన్సిలర్లు రాజు నాయక్, జమాల్పూర్ చందు తదితరులను ఆహ్వానించారు.
ఈ సందర్భంగా ఆయన చేత శ్రీరామ శోభాయాత్ర ఆహ్వాన పత్రాలను విడుదల చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ హిందూ సంప్రదాయంలో శ్రీరామచంద్రుడికి ఒక ప్రత్యేకత ఉందని,అలాంటి మహనీయుడి శోభాయాత్రలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని వెల్లడించారు.
అదేవిధంగా మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, కౌన్సిలర్లు సంతోషి బాయ్ చందూలాల్,రాజు నాయక్ తదితరులకు ఆహ్వాన పత్రాలు అందించారు. దువాహిని సభ్యులు చెట్ల వెంకటేష్,క్యామ మహేష్,సల్లా మహేష్, చింతకుంట రాఘవేందర్, కమలాజి శ్రీనివాస్ చారి,గుండు అశోక్,గంద్రాతి శివశంకర్,మంగ విజయ్,పసలోటి శ్రావణ్,గుడాల వెంకటేష్,అల్లాడి శ్రీను,మాడమోని మధు,రామకృష్ణ, దేవేందర్,అశోక్,తరుణ్,శ్రీకాంత్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇతర రాష్ట్రాల కార్మికులకు సైబర్ నేరాలు,రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు..

## నందిగామ సిఐ పీ.ప్రసాద్..



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్, రంగారెడ్డి జిల్లా,నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలోని (పిట్టి) కంపెనీని నందిగామ(ఎస్.హెచ్.ఓ) పి.ప్రసాద్ మరియు పోలీస్ సిబ్బంది సందర్శించారు.ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న బీహార్,ఒరిస్సా, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.ఈ కార్యక్రమంలో వారికి నిత్య జీవితంలో ఎదురయ్యే పలు కీలక అంశాలపై చాలా సులభంగా అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు.
**సైబర్ నేరాలు** తెలియని వ్యక్తులకు ఫోన్ నంబర్లు, (ఓటీపీ)లు అస్సలు చెప్పకూడదని సూచించారు. తక్కువ ధరకే వస్తువులు వస్తాయనే ఆశతో లేదా లాటరీ వచ్చిందనే మాటలతో మోసపోవద్దని తెలిపారు.ఒకవేళ ఎవరైనా మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.
**రోడ్డు భద్రత (ఆరైవ్ అలైవ్)** ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని,బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. అతివేగంగా వాహనాలు నడపవద్దని,ప్రాణాల కంటే ఏదీ ముఖ్యం కాదని వివరించారు.
**గంజాయి నిరోధం** గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని హెచ్చరించారు. మత్తులో నేరాలకు పాల్పడితే కఠినమైన జైలు శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. పోక్సో చట్టం చిన్న పిల్లల పట్ల తప్పుగా ప్రవర్తించినా, లేదా వారిపై అఘాయిత్యాలకు పాల్పడితే చట్టం చాలా కఠినంగా ఉంటుందని వివరించారు. పిల్లల రక్షణ అనేది సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుచేశారు.
ఏదైనా సమస్య ఎదురైనా లేదా అత్యవసర పరిస్థితుల్లో ఉన్నా వెంటనే స్థానిక పోలీసులను సంప్రదించాలని లేదా డైల్ 100 / 112 కు సమాచారం అందించాలని కార్మికులకు సూచించారు.

# ఈ నూతన సంవత్సరం రైతు నామ సంవత్సరం

## రైతుల సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు

## శ్రీ పరాభవ నామ ఉగాది వేడుకల్లో రేవంత్ రెడ్డి

**హైదరాబాద్‌మార్చి 20 ప్రజావినికిడి,** తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును రాజును చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ అందిస్తున్నాం అన్నారు. దేశంలోనే రైతుల విషయంలో అతి తక్కువ రుణభారం ఉన్న రాష్ట్రం తెలంగాణ అని ప్రకటించడం మనకు గర్వకారణం అన్నారు. తెలంగాణలో 70 శాతం వ్యవసాయ ఆధారిత కుటుంబాలే,అందుకే రూ.2 లక్షల రుణమాఫీ చేసి రైతులను రుణవిముక్తులను చేశాం అన్నారు. రవీంద్రభారతిలో ఉగాది వేడుకలలో భాగంగా శ్రీ పరాభవ నామ ఉగాది పంచాంగాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. 18 వేల కోట్లు రైతు భరోసా కోసం ఖర్చు చేశాం.ఈ నెల 22 న మరోసారి రైతుభరోసా నిధులను విడుదల చేయబోతున్నాం. రైతు సంక్షేమానికి, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పట్టుపడుతోంది.ధరణి భూతాన్ని తరిమేసి భూ భారతితో భూసమస్యలను పరిష్కరిస్తున్నాం.దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

# అభివృద్ధి పేరిట వచ్చారు..

# గుడినే కొల్లగొట్టారు..!



## దర్గాగా గుళ్ళో గుప్త నిధుల వేట - వేముల నర్వ గ్రామంలో దారుణం - గుడిలో భారీగా తవ్వకాలు..



- గ్రామస్తులకు తెలియని “రహస్య నేల మాలిగ”లోకి ప్రవేశం
- నంబయ్య గుట్ట వేణుగోపాలస్వామి గుడిలో గుర్తు తెలియని వ్యక్తుల హల్చల్
- పురాతన రాతి పలకలు బద్దలు - పలుచోట్ల తవ్వకాలు
- ఆలస్యంగా నిజాన్ని గ్రహించిన గ్రామస్తులు - కేశంపేట పోలీసులకు ఫిర్యాదు
- గ్రామ సర్పంచ్, ఆలయ పూజారి అనుమతితోనే ..
- కేశంపేట పోలీస్ స్టేషన్లో గ్రామస్తుల ఫిర్యాదు
- కేశంపేట పోలీస్ స్టేషన్లో రేపు లిఖితపూర్వక ఫిర్యాదు చేస్తా - ఈవో రామ శర్మ







**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
గుడిని అభివృద్ధి చేస్తామని చల్లంగా వచ్చి.. మెల్లంగా గుడిని గుల్ల చేశారు. 800 సంవత్సరాల నాటి అతి ప్రాచీన దేవాలయంలో గుట్ట నిధుల కోసం ఆలయ నిబంధనలకు విరుద్ధంగా రాతి కట్టడాలను బద్దలు కొట్టారు. ఇప్పటివరకు గ్రామానికి తెలియని నేలమాలిగను కనుక్కొని అందులోకి సునాయాసంగా ప్రవేశించారు.
ఆలయంలో అభివృద్ధి పేరిట తిష్ట వేసిన గుర్తుతెలియని ఘనులు చేసిన తప్పుడు పనులు ఇవి. స్థానికులను ఎలా ఒప్పించారో, ఎలా మెప్పించారో తెలియదు కానీ వచ్చిన నాటి నుండి ఆలయ ప్రాంగణంలో గర్భగుడిలో నియమ నిష్టలకు విరుద్ధంగా భారీ తవ్వకాలు చేపట్టారు.
ఆలస్యంగా జరుగుతున్న పరిణామాన్ని గ్రహించిన గ్రామస్తులు నిలదీసేసరికి వారు మెల్లగా జారుకున్నారు.
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం నంబయ్య గుట్ట శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో జరిగిన దారుణం ఇది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటన గ్రామస్తులను మండల ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేస్తుంది. అనేక రాతి కట్టడాలు ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.
జరిగిన ఘటనలో గుర్తుతెలియని వ్యక్తులకు ఆలయ ప్రవేశానికి అనుమతి ఇవ్వడంలో పొరపాటు జరిగిందని ఓవైపు గ్రామ పెద్ద సర్పంచ్, ఆలయ పంతులు చెబుతుండగా అసలు ఈ ఘటనను ఎలా చేయాలి అని గ్రామస్తులు ఆలోచిస్తున్నారు.

### అసలేం జరిగిందంటే..?

కేశంపేట మండలం వేముల నర్వ గ్రామంలో సాంబయ్య గుట్ట శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో అభివృద్ధి పనులు చేస్తామని గుర్తు తెలియని వ్యక్తులు కొందరు ఆలయ పూజారితో కమిట్మెంట్ అయ్యారు. గ్రామ పెద్ద సర్పంచ్ తదితరుల దృష్టికి తీసుకువచ్చి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని నమ్మ బలికారు.
ఆలయ పూజారి వేణయ్య పంతులు చొరవతో ఆలయంలోకి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తులు తమ పని ఎంతో పకడ్బందీగా కానిచ్చారు. ఆలయ ప్రాశత్యానికి విరుద్ధంగా దేవాలయ మహిమాన్వితత్వం మంటగలిసే విధంగా గర్భగుడితోపాటు ఆలయ ప్రాంగణంలో పలు రాతి కట్టడాలను రాళ్లను పెకిలించారు. ఇష్టం వచ్చినట్టుగా అక్కడక్కడ తవ్వకాలు జరిపారు. ముఖ్యంగా గ్రామస్తులకు తెలియని ఒక నేలమాలిగను వారు చూసి అందులో ఏం చేశారు తెలియదు. అసలు శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో వెనుక కింద నేలమాలిగ ఉన్నట్టు ఎవరికి తెలియదు. ఆ నేలమాలిగ గది మొత్తం పూర్తిగా శుభ్రం చేసి ఉంది. అంతేకాదు ఆలయంలో కొన్ని నిమ్మకాయలు, గుమ్మడికాయలు దర్శనం ఇచ్చాయి. ఇవి ఓ సంచిలో లభించాయి. ఇక్కడ గుత్త నిధుల కోసం దర్జాగా రాత్రింబవళ్లు వేట కొనసాగించినట్లు అర్థం అవుతుంది.

### ఏం జరిగిందో ఎవరికి తెలియదు

సాంబయ్య గుట్ట, లంబాయగుట్ట అనే పేర్లతో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వర్ధిల్లుతుంది. దాదాపు 80 సంవత్సరాల క్రితం నాటి ఆధ్యాత్మిక ప్రదేశానికి ఈ ఆలయం ఒక నిలయం.ఇలాంటి పరమ పవిత్రమైన ఆలయ ప్రాంగణంలో గర్భగుడిలో అపచారం జరిగే విధంగా గుర్తుతెలియని వ్యక్తులు అభివృద్ధి పేరిట వచ్చి గుప్తనిధుల వేటను కొనసాగించడం గ్రామస్తులను ఆశ్చర్యానికి గురిచేసింది. గుట్టపై గుడిలో నిధులు ఉన్నాయని పూర్వీకులు చెబుతుంటారని కానీ ఎవరు వాటి గురించి ఆరా తీయడం తవ్వకాలు జరపడం లాంటి సంఘటన ఎప్పుడు జరగలేదు. ఎంతో మహిమాన్వితమైన ఈ ఆలయ ప్రాంగణంలో ఇలాంటి దురాలోచనలకు తావులేదు. కానీ ఎవరు ఉప్పు అందించారు ఎవరు ఈ కుట్రకు భాగస్వాములు అయ్యారు తెలియదు కానీ గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ పూజారి ద్వారా గుడిలోకి ప్రవేశించి ఊరి పెద్ద కు ఒక మాట చెప్పి గుళ్లో తవ్వకాలు చేయడం ఇప్పుడు గ్రామస్తులకు అనుమానాలకు గురిచేసింది. ఈ సమాచారం ఆ నోట ఈ నోట పాకడంతో గ్రామస్తులు అందరూ చైతన్యవంతమయ్యారు. ఆలయంలో జరుగుతున్న అప్రాశ్చ పనులను చూసి నిర్ఘాంత పోయారు. వెంటనే తవ్వకాలు ఆపాలని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో గుర్తుతెలియని వ్యక్తులు చల్లగా జారుకున్నారు. గుడి పంతులు వేణయ్య సైతం తనకు ఇదంతా తెలియదని వారిని నమ్మానని వారు ఇలా చేస్తారని అనుకోలేదని చెబుతున్నట్లు సమాచారం. తప్పు జరిగింది క్షమించండి అని గ్రామస్తులకు చెబుతున్నట్లు తెలుస్తుంది. ఇక గ్రామ సర్పంచ్ సైతం జరిగిన పొరపాటు సరిదిద్దుకునే పనిలో పడిపోయారు. ఇంత జరుగుతుందని తాను కూడా ఊహించలేదని పంతులను గుడ్డిగా నమ్మినట్లు గ్రామస్తులు ముందు వాపోయినట్టు తెలుపుతున్నారు. రెండు లక్షల రూపాయలతో అభివృద్ధి చేస్తామని గుర్తుతెలియని వ్యక్తులు పకడ్బందీ ప్లాన్ తో ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించినట్లు ఇప్పుడు తేట తెల్లం అయింది.

### నిధులు లభించాయా..?

ఆలయంలో కొన్ని రోజులపాటు దర్జాగా సాగిన నిధుల తవ్వకాల విషయంలో ఏం జరిగింది అని గ్రామస్తులు ఉత్కంఠగా ఆలోచిస్తున్నారు. కొందరు నిధులు దొరికాయని నేలమాలిగలో నిక్షేపాలు లభించి ఉండవచ్చు అని కొందరు అంటున్నారు. మరికొందరు గర్భగుడి తదితర ఆలయ ప్రాంగణాలలో ఏదైనా దొరికి ఉండవచ్చు శాస్త్రాలు చదివి ఇక్కడ నిధులు ఉన్నాయని గ్రహించి ఎంతో పగడ్బందీగా 2 లక్షల రూపాయలు చూపి ఆలయంలోకి ప్రవేశించిన కుట్ర వెనుక పెద్దల హస్తం కూడా ఉండవచ్చని ఇప్పుడు గ్రామం కోడై కూస్తుంది. ఇక ఆలయ కార్య నిర్వహణ అధికారి రామ శర్మ ఉన్నారు.

### గ్రామ సర్పంచ్, ఆలయ పూజారి అనుమతితోనే..

ఆలయ ప్రగతి పేరిట దేవాలయంలో పనులు చేపట్టామని ఆలయ సర్పంచ్ చిన్న నరసింహులు ఆలయ ఇన్చార్జి, దేవాలయ కార్యనిర్వాహణాధికారి రామశర్మకు తెలియజేశారు. తానే ఆలయ ప్రగతి కోసం తవ్వకాలకు అనుమతి ఇచ్చినట్టు ఒప్పుకున్నారని ఆలయ ప్రగతిలో భాగంగానే ఇది జరిగినట్టు సర్పంచ్ చిన్న నరసింహులు చెప్పారని ఇంచార్జ్ ఈవో రామ శర్మ మీడియా ప్రతినిధికి చెప్పారు.అయితే ఆలయ పూజారి వేనయ్య, తదితర పాలకవర్గం పాత్ర ఇందులో ఎంత ఉంది అని విషయం కూడా తేలాల్సి ఉంది. విషయమై ఈవో రామ శర్మను మీడియా వివరణ కోరగా.. ఆలయంలో పనులు చేపట్టిన ఏ కార్యక్రమం చేపట్టిన ప్రభుత్వ దృష్టికి తీసుకురావాల్సిన అవసరం ఉందని సర్పంచ్ గుడిలో జరిగే ముఖ్యమైన పనులకు అనుమతి ఇవ్వకూడదని తెలిపారు. ఎండోమెంట్ శాఖ చూసుకుంటుందని ఒకవేళ ఆలయంలో ఏదైనా వాస్తు బాగా లేకపోయినా ప్రగతి జరగకపోయినా ఆలయ సిబ్బందికి లేదా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలని ఇక్కడ పనులు చేపట్టేందుకు ఎండోమెంట్ శాఖ అనుమతి ఉండాలని తెలిపారు.మరి అలాంటిది ఎవరికీ చెప్పకుండా సర్పంచ్ అనుమతి గుర్తు తెలియని వ్యక్తులకు ఎందుకు ఇచ్చారు. ఆలయ పూజారి ఎలా ఊరుకున్నారు. అన్న అనుమానాలు ఇప్పుడు బలపడుతున్నాయి.
ఉన్న విషయాన్ని తప్పకుండా ఎండోమెంట్ శాఖ తరపున కేశంపేట పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేస్తానని ఈవో రామ శర్మ మీడియాకు స్పష్టం చేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# అభిశంసనతో సాధించేదేమిటి?



**మార్చి 20 ప్రజావినికిడి,**
సర్ ప్రక్రియలతో అనేక రాష్ట్రాల్లో లక్షల ఓట్లు తొలగించారు. అయితే తొలగించిన ఓట్లకు సంబంధించి ఎక్కడా పెద్దగా ఫిర్యాదులు అందలేదు. దీంతో ఇప్పుడు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆయా పార్టీలు తిరిగి అధికారం పొందుతాయా అన్న సందేహంలో ఉన్నాయి. ప్రధానంగా బెంగాల్లో మమతా బెనర్జీకి అధికార భయం పట్టుకుంది. సర్‌తో బెంగాల్లో 60 లక్షలకు పైగా ఓట్లు తొలగించారని తెలుస్తోంది. సర్ ప్రక్రియ ముగిసిన తరవాత వివిధ రాష్ట్రాలకు ఎన్నికల నగారా మోగింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దఫాల్లోనూ, మిగిలిన చోట్ల ఏప్రిల్ 9న ఒకే దఫాతో ఎన్నికలు ముగుస్తాయి. ఐదు అసెంబ్లీల పరిధిలో 824 స్థానాలకు జరగనున్న ఈ ఎన్నికల్లో ఎస్ఐఆర్ పక్రియతో సుమారు కోటీ 40 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. అయితే ఏ రాష్ట్రంలోనూ ప ఎద్దగా వ్యతిరేకత రాలేదు. వ్యతిరేకత కేవలం మమతా బెనర్జీ, స్టాలిన్ లాంటి వారి నుంచి వచ్చాయి. తాము ఓట్లు కోల్పోయామని పదుల సంఖ్యలో కూడా ఎవ్వరూ ముందుకు రాకపోవడం గమనించాలి. అయితే ఓటు నమోదులో ఇప్పటికీ శాస్త్రీయ పద్దతిని అవలంబించడం లేదు. పక్కాగా ఓటరు కార్డు దక్కడం లేదు. ఓటు నమోదు మొదలు, ఓటు తొలగింపు వరకు అంతా గందరగోళంగా సాగుతోంది. ఈ క్రమంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశ పెట్టారు. ఎన్నికల కమిషన్ ఓ రాజ్యాంగ ప్రతిపత్తి గలిగిన సంస్థ. దాని పని అది చేసుకుంటూ పోతున్నది. ఎవరు అధికారంలో ఉన్నా, ఎన్నికల కమిషన్ పనిచేస్తూనే ఉంది. కానీ విపక్ష కాంగ్రెస్, తదితర పార్టీలకు ఇది మింగుడు పడడం లేదు. అందుకు జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన నోటీసులు ఇచ్చారు. ఇది కేవలం రాజ్యాంగ సంస్థ నిజాయితీని నిలదీయడం తప్ప మరోటి కాదు. ఇప్పటికే స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసం ప్రవేశ పెట్టిన కాంగ్రెస్ తదితర పక్షాలు తలబొప్పి కట్టించుకున్నాయి. ఇకపోతే రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో 17.4 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. ప్రత్యేక సమగ్ర ఓటర్ల పరిశీలన సర్ పేరుతో తొలగించండతో తట్టుకోలేక పోతున్న ఓట్లను ప్రతిపక్షాలు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను నిలదీసే లక్ష్యంతో అభిశంసన తీర్మానం ప్రవేశ పెట్టారని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. బెంగాల్, అసోం లాంటి రాష్ట్రాల్లో పక్కనే ఉన్న బంగ్లా జాతీయు ఓట్లను తొలగించే ప్రక్రియ జరగింది. అక్రమంగా ఇక్కడ తిష్టవేసి ఓటర్లుగా మారారు. వారే రాష్ట్రాల్లో ఎవరు అధికారంలో ఉండాలో నిర్ణయించే దశకు చేరుకున్నారు. మరో వైపు ఒక్క చట్టబద్ధమైన ఓటరు కూడా తన ఓటు హక్కు కోల్పోకుండా చూశామని సిఇసి జ్ఞానేష్ కుమార్ స్పష్టం చేశారు. ఒక్క అనర్హుడు కూడా ఓటు వేసే అవకాశం లేకుండా చూడటమే తన లక్ష్యమని చెప్పారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన అప్పిలేట్ ట్రిబ్యునళ్లు రోజుకు లక్ష వరకూ ఫిర్యాదులను పరిష్కరిస్తున్నాయి. నోటిఫికేషన్ రాగానే బెంగాల్ సిఎస్, డిజిపి, హోం శాఖ కార్యదర్శి, కొల్‌కతా సిపిలను ఇసి బదిలీ చేయడం ద్వారా మమతకు వత్తాసుగా ఉన్న వారిని తొలగించింది. పశ్చిమ బెంగాల్‌లో పగ్గాలు చేజిక్కించుకోవాలని, కేరళం, తమిళనాడులోనూ అధికారం నిలబెట్టుకునేందుకు ఆయా పార్టీలు చేస్తున్న ప్రయత్నాలకు నిజంగానే సర్ విఘాతం కలిగించి ఉంటుంది. ఓ వైపు మత విద్వేషాలు, హింసను రెచ్చగొట్టడం ద్వారా కుల, మత విభజనను తీసుకురావడం ద్వారా మరోమారు అధికారంలో కొనసాగాలని మమతా బెనర్జీ, స్టాలిన్ లాంటి వారు ఎత్తులు వేస్తున్నారు. అందుకే మమతా బెనర్జీ ఏకంగా 50శాతం సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు నిరాకరించింది. తమిళనాడులో డిఎంకె నేతృత్వంలోని ప్రభుత్వం రెండోసారి అధికారాన్ని నిలబెట్టు కునేందుకు ప్రజాతీర్పును కోరుతోంది. పదేళ్ల పాలనలో అభివృద్ధి చెందిన దేశాల జీవన ప్రమాణాలతో పోటీ పడేలా కేరళంను తీర్చిదిద్ది, తీవ్ర పేదరికాన్ని తరిమేసి, ఎన్నో ఉద్యోగావకాశాలు కల్పించినట్లు పినరయి విజయన్ నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ చెప్పుకుంటోంది. ప్రజానుకూల పాలనకు, ప్రజలపై ఉన్న నమ్మకానికి ప్రతీకగా మరోమారు విజయం సాధిస్తామని చెబుతోంది. అయిదు రాష్ట్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్య యుతంగా జరగాలని కోరుకుంటున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. అయితే జ్ఞానేశ్ కుమార్‌ను అభిశంసిండం అంత సులువు కాదు. అధికార ఎన్‌డిఎ పూర్తి మద్దతుతో ఉండడంతో ఈ ప్రయత్నం ఎరవేరక పోవచ్చు. అలాగే సర్ ప్రక్రియను అడ్డుకోవడం ద్వారా బీహార్‌లో కాంగ్రెస్ తలబొప్పి కట్టించుకుంది. మమతా బెనర్జీ కూడా సుప్రీంతో చివాట్లు తింది. ఇవన్నీ మరచి వీరు చేస్‌ఏ ప్రయత్నాలతో రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసే పని తప్ప మరోటి కాదని గుర్తించాలి. అలాగే అధికారంలో ఉంటూ మమతా బెనర్జీ లాంటి వారు రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడడం క్షమించరాని నేరంగా పరిగణించాలి.

# ఎరువుల ఉత్పత్తికి ఇంధన పోటు

### ఎరువుల సరఫరాను నిలివిపేయనున్న చైనా

### భారత్ తదితర దేశాలకు రవాణ ఆపే చర్యలు

### పలుదేశాల వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం



**న్యూఢిల్లీ,మార్చి 20 ప్రజావినికిడి,**
ముడి చమురు సరఫరాలో అవాంతరాలతో ఇక్కట్ల పాలవుతున్న ప్రపంచదేశాలకు కొత్త సమస్య వచ్చి పడేటట్టు ఉందన్న భయాలు నెలకొన్నాయి. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇప్పటికే చమురు సరఫరా సమస్యలు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు ప్రపంచంలోని అతిపెద్ద ఎరువుల ఎగుమతిదారుల్లో ఒకటిగా ఉన్న చైనా యుద్ధ ప్రభావం వల్ల.. జెట్ ఇంధనం, డీజిల్, ఎరువుల ఎగుమతులపై పలు నిబంధనలు విధించడానికి చర్యలు తీసుకుంటోంది. దీంతో ప్రపంచ మార్కెట్‌లో యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఆందోళన నెలకొంది. ఎరువుల ఎగుమతుల్లో ప్రపంచంలో నెం. 2గా ఉన్న చైనా వీటి ఎగుమతులపై ఆంక్షలకు సిద్ధమైంది. ఎగుమతుల్లో కోత పెట్టాలని చైనా ఆర్థిక ప్రణాళిక సంస్థ ఎన్‌డీఆర్‌సీ దేశీయ సంస్థలకు సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో జెట్ ఫ్యుయెల్, డీజిల్, కిరోసిన్‌ల ఎగుమతులను తగ్గించాలని గత నెలలో ఎన్‌డీఆర్‌సీ సూచించింది. దేశీయ ఇంధన, ఆహార అవసరాల కోసం చైనా ఎగుమతులపై ఆంక్షలు విధిస్తోందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. చైనా ఎరువులు ఆస్ట్రేలియా, వియత్నాం వంటి దేశాలతో పాటు భారత్‌కూ ఎగుమతి అవుతుంటాయి. కొన్ని దేశాలకు ఎగుమతులను నిలిపివేయాలని తమకు ఆదేశాలు అందాయని షాండాంగ్ ప్రావిన్స్‌లోని ఒక ఫర్టిలైజర్ సంస్థ అధికారి పేర్కొన్నారు. అయితే, ఈ ఆంక్షల విషయమై చైనా ఇంకా అధికారికంగా స్పందించలేదు. ఎగుమతులకు బ్రేకులు తప్పవని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడు తున్నాయి. దేశీయ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు చైనా అన్ని చర్యలు తీసుకుంటుందని అంటున్నాయి. ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ డేటా ప్రకారం, ఎరువుల ఎగుమతుల్లో రష్యా నెం.1 కాగా రెండో స్థానంలో చైనా ఉంది. జెట్ ఫ్యుయెల్ ఎగుమతి చేసే దేశాల్లో చైనా ఆరవ స్థానంలో ఉంది. అంతర్జాతీయ వాణిజ్య కేంద్రం డేటా ప్రకారం.. జెట్ ఇంధనం, డీజిల్, కిరోసిన్‌ల విదేశీ రవాణాను నిలిపివేయాలని చైనా జాతీయ అభివృద్ధి, సంస్కరణల కమిషన్ అక్కడి పరిశ్రమ వర్గాలకు ఆదేశాలు జారీ చేసింది. మార్చి మధ్య నుంచే నైట్రోజన్, పొటాషియం ఎరువుల మిశ్రమాలపై నిబంధనలు విధించింది. ఇప్పటికే యూరియా ఎగుమతిని బ్యాన్ చేసిన బీజింగ్.. అమ్మోనియా సల్ఫేట్ ఎగుమతికి మాత్రం అనుమతినిచ్చింది. ఇంధన, ఆహార నిల్వలు పరిరక్షించుకోవడానికి, దేశీయ మార్కెట్‌ను కాపాడుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. అయితే భారత్‌కు ఎరువుల ఎగుమతిని నిలిపివేయాలని చైనాలోని షాన్‌డాంగ్ ప్రావిన్స్‌లోని ఓ ఎరువుల తయారీ సంస్థకు ప్రభుత్వ ఆదేశాలు వచ్చినట్లు అక్కడి ఉద్యోగులు వెల్లడించారు. బీజింగ్ నుంచి ఆస్ట్రేలియా, వియత్నాం, భారత్ సహా పలు దేశాలు ప్రస్తుతం ఎరువులను దిగుమతి చేసుకుంటున్నాయి. చైనా నుంచి ఎగుమతులు నిలిచిపోవడం వల్ల ప్రపంచ మార్కెట్‌లో యూరియా ధరలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల వ్యవసాయ ఆధారిత దేశాలపై ప్రభావం పడే అవకాశం

ఉందన్నారు. మరోవైపు యూరియా ఉత్పత్తికి అవసరమైన ద్రవరూప సహజ వాయువు ఎల్ఎన్‌జీ సరఫరా లేకపోవడంతో భారత్‌లోని పలు యూరియా కంపెనీలు ఎ÷-లాంట్లను మూసివేసే పరిస్థితులు నెలకొన్నట్లు ఇటీవల పలు సర్వేలు వెల్లడించాయి.

# ప్రపంచ దేశాలలో కంటే ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉంచడమే మోదీ ధ్యేయం

### ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని ఎదిర గ్రామంలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు -పాలమూరు ఎంపీ డీకే అరుణ..

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామని మహబూబ్ నగర్ ఎంపీ శ్రీమతి డీకే అరుణమ్మ అన్నారు. షాద్ నగర్ నియోజకవర్గంలోని జిల్లెడ్ చౌదరిగూడ మండలం ఎదిర గ్రామంలో అరబిందో ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటుచేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ ను ప్రారంభించడం జరిగింది.
ఎంపీ అరుణమ్మ మాట్లాడుతూ,
గ్రామ పంచాయతీలలో అభివృద్ధి పనులు జరుతున్నాయి అంటే కేంద్రప్రభుత్వం నిధుల ద్వారానే జరుగుతున్నాయని ప్రతి గ్రామ సర్పంచ్ కు తెలుసు అని అన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు గాని, అంగన్వాడీ భవనాలు గాని, దాన్య సేకరణ గోదాంలు గాని గ్రామ పంచాయతీ భవనాలు గాని, పాఠశాల భవనం వీటన్నింటికి కేంద్రప్రభుత్వం నిదులే అని అన్నారు. ఒక






పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీలు ఉంటాయి కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం కూడ గ్రామ పంచాయతీలకు నిధులు ఇచ్చి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, ఎదిర గ్రామ సర్పంచ్ దొడ్ల లక్ష్మీదామోదర్ రెడ్డి,చౌదరి గూడ మండల అధ్యక్షులు ఎదిర రాజు,చెంది మహేందర్ రెడ్డి, వెంకటేష్ గుప్త, కందూరి మనోహర్ రెడ్డి,డాక్టర్ విజయ్ కుమార్,విజయ భాస్కర్, కొందుర్గు,కొత్తూరు మండలాల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, అత్తాపూర్ మహేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


# నేడు రంజాన్ సెలవు

### నేటి పదో తరగతి పరీక్ష ఎప్రిల్ 2కు వాయిదా

**అమరావతి,మార్చి 20 ప్రజావినికిడి,**
రంజాన్ సెలవును ఈ నెల 21వ తేదీ శనివారానికి మార్పు చేస్తూ ఎపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మొదట మార్చి 20 న ప్రభుత్వం రంజాన్ సెలవుగా ప్రకటించింది. మతపెద్దల నిర్ణయం మేరకు 21వ తేదీ శనివారం రంజాన్ పర్వదినాన్ని నిర్వహిస్తుండటంతో ఆ రోజును సెలవుగా ప్రకటిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా పనిచేస్తాయని తెలిపింది. కాగా శనివారం జరగాల్సిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షను వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు. ఈ పరీక్షను ఏప్రిల్ 2 న నిర్వహించనున్నట్లు తెలిపారు.

------

# చంద్రగిరిలోనే తిష్టవేసిన గజరాజులు



**తిరుపతి,వమార్చి 20 ప్రజావినికిడి,**
చంద్రగిరి మండలం, ఎల్లంపల్లెలో ఏనుగుల మంద కలకలం రేపింది. గత వారం రోజులుగా గ్రామంలోనే గజరాజులు తిష్ఠ వేశాయి. రాత్రి వేళల్లో పంట పొలాలపై ఏనుగులు విరుచుకుపడుతున్నాయి. ఏనుగుల దాడిలో పంటలు దెబ్బతిన్నాయి. ఏనుగుల నుంచి తప్పించుకునే క్రమంలో పశువుల కాపరి ముత్తు రామయ్యకు గాయాలయ్యాయి. గజరాజుల సంచారంతో ఎల్లంపల్లె గ్రామస్తులు భయాందోళనతో బతుకుతున్నారు. ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు ఫారెస్ట్ అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు.

-----

# డాలర్‌తో రూపాయి మారకం 93.15 కు చేరిక




**న్యూఢిల్లీ,మార్చి 20 ప్రజావినికిడి,**
మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ శుక్రవారం ట్రేడింగ్ ఆరంభంలో రికార్డు స్థాయిలో పతనమైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తొలిసారిగా 93.15 వద్దకు చేరింది. గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాల్చడం రూపాయి మారకం విలువపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. ఇక బ్రెంట్ క్రూడ్ ధర ప్రస్తుతం బ్యారెల్ 100 డాలర్లకు పైనే కొనసాగుతోంది. ముడి చమురు సరఫరాలో అంతరాయాలు సుదీర్ఘకాలంపాటు కొనసాగుతాయన్న భయాలు బ్రెంట్ క్రూడ్ ధరలు పైకి ఎగబాకేలా చేస్తున్నాయి. చమురు ధరలు పెరిగే కొద్దీ డాలర్‌కు డిమాండ్‌కు పెరిగి రూపాయి విలువపై ప్రతికూల ప్రభావం పడుతోందని నిపుణులు చెబుతున్నారు. మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు స్టాక్ మార్కెట్‌పైనా తీవ్ర ప్రభావం చూపించాయి. గురువారం గ్లోబల్ మార్కెట్స్‌లో ఇన్వెస్టర్లు అమ్మకాలకు తెగబడటంతో సూచీలు కుప్పకూలాయి. డాలర్‌పై పెట్టుబడులు పెరగడంతో అమెరికన్ కరెన్సీ మరింత బలపడింది. ఫలితంగా రూపాయి సహా అనేక వర్ధమాన దేశాల కరెన్సీలపై ప్రతికూల ప్రభావం పడిందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. వ్యవస్థాగత మదుపర్లు కూడా భారత్ నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకోవడంతో రూపాయి విలువపై ఒత్తిడి మరింత పెరిగింది. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ద్రవ్యపరపతి విధానం కూడా ఈ పరిస్థితికి కొంత దోహదపడిందని నిపుణులు చెబుతున్నారు. ద్రవ్యోల్బణం ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో యూఎస్ ఫెడ్ వడ్డీ రేటులో కోత పెట్టేందుకు సంకోచిస్తోంది. దీంతో, పెట్టుబడిదారులకు డాలర్ మరింత ఆకర్షణీయంగా మారి వర్ధమాన మార్కెట్స్ నుంచి నిధులు తరలి పోతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

# 2027 ప్రపంచకప్‌నకు బీసీసీఐ భారీ ప్రణాళికలు


### జట్టు ఎంపిక, ఆటగాళ్ల ఫిట్‌నెస్, ఐపీఎల్ ప్రదర్శనపై నిఘా

### 20 మందితో జాబితా సిద్ధంచేసిన బీసీసీఐ అధికారులు



2027 వన్డే వరల్డ్ కప్‌నకు ఇంకా ఏడాదిపైగానే సమయం ఉన్నప్పటికీ, బీసీసీఐ ముందుగానే జట్టు రూపకల్పనపై దృష్టి పెట్టింది. గత ఐసీసీ టోర్నీల్లో విజయాలు సాధించిన భారత జట్టు, ఈసారి కూడా ట్రోఫీపై కన్నేసింది. ఇటీవల భారత వన్డే, టెస్ట్ జట్లకు శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహిస్తున్నాడు. అయితే అతని కెప్టెన్సీలో జట్టు ప్రదర్శన మిశ్రమంగా ఉంది. ఆస్ట్రేలియా పర్యటనలో సిరీస్ కోల్పోవడం, స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో ఓటమి ఎదురవడం బీసీసీఐ ఆలోచనలను ప్రభావితం చేసింది. బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఐపీఎల్ 2026 మ్యాచ్‌లను జాగ్రత్తగా పరిశీలించనుంది. ప్రతి సెలెక్టర్ వారానికి కనీసం ఒక మ్యాచ్‌ను ప్రత్యక్షంగా లేదా టీవీ ద్వారా వీక్షిస్తూ ఆటగాళ్ల ఫామ్, ఫిట్‌నెస్‌ను అంచనా వేయనున్నారు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని ఈ కమిటీ వరల్డ్ కప్‌నకు సరైన జట్టును ఎంపిక చేయడంలో కీలక పాత్ర పోషించనుంది. వరల్డ్ కప్ కోసం బీసీసీఐ సుమారు 20 మంది ఆటగాళ్ల జాబితాను సిద్ధం చేయాలని భావిస్తోంది. ఇందులో శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, కేఎల్ రాహుల్ వంటి కీలక ఆటగాళ్లు ప్రధానంగా ఉంటారు. కొత్త ఆటగాళ్లను ఎక్కువగా ప్రయోగించకుండా, స్థిరమైన జట్టుతో ముందుకు వెళ్లాలనే ఆలోచన ఉంది. టెస్ట్ క్రికెట్‌లో ప్రయోగాలకు బీసీసీఐ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ వంటి బౌలర్లు ప్రధాన ఎంపికగా కొనసాగనున్నారు. ఆఫ్ఘానిస్థాన్‌తో జరిగే టెస్ట్ మ్యాచ్‌లో కూడా వీరే కీలకంగా ఉండనున్నారు. టెస్ట్, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే ఆడుతున్నారు. ఇటీవలి సిరీస్‌ల్లో వీరి ప్రదర్శన స్థిరంగా ఉండటం గమనార్హం. అయితే ప్రతి మ్యాచ్ వీరి కెరీర్‌కు కీలకంగా మారుతోంది. వరల్డ్ కప్ జట్టులో వీరికి స్థానం దక్కుతుందా అన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. భారత జట్టు ఈ ఏడాది జూన్‌లో ఆఫ్ఘానిస్థాన్‌తో ఒక టెస్ట్, మూడు వన్డే మ్యాచ్‌లు ఆడనుంది. ఈ సిరీస్ కూడా వరల్డ్ కప్ జట్టు ఎంపికపై ప్రభావం చూపే అవకాశం ఉంది. బీసీసీఐ ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేస్తుండటం భారత జట్టు సీరియస్‌నెస్‌ను చూపిస్తోంది. అనుభవం, యువత కలయికతో 2027 వరల్డ్ కప్‌కు బలమైన జట్టు సిద్ధం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# మ్యాచ్ విన్నర్లను తయారు చేస్తున్నారు: కైఫ్



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) సపోర్ట్ స్టాఫ్‌పై ఆ జట్టు మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ ప్రశంసల జల్లు కురిపించాడు. ఆర్‌సీబీలో కొత్త శకం మొదలైందని, అక్కడ ఆటగాళ్లను కాకుండా మ్యాచ్ విన్నర్లను తయారు చేస్తున్నారని తెలిపాడు. జట్టులోని ప్రతి ఆటగాడితో ఫలితాన్ని రాబడుతున్నారని చెప్పాడు. ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ మ్యాచ్‌లోనే డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్‌సీబీ.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా మార్చి 28(శనివారం) ఈ మ్యాచ్ జరగనుంది. అప్‌కమింగ్ సీజన్ నేపథ్యంలో తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మహమ్మద్ కైఫ్ ఆర్‌సీబీ జట్టును విశ్లేషించాడు. రూ.7 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన వెంకటేశ్ అయ్యర్‌ను ఏ స్థానంలో ఆడిస్తారో అర్థం కావడం లేదని, అతని కోసం దేవదత్ పడిక్కల్‌ను పక్కనపెడుతారా అనేది చూడాలన్నాడు. 'బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం పిచ్.. బంతి బ్యాట్ మీదకు వచ్చేలా ఆడేవారికి, షాట్ మేకింగ్‌ను ఇష్టపడేవారికి, ఫాస్ట్ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనే బ్యాటర్లకు బాగా సహకరిస్తుంది. వెంకటేష్ అయ్యర్ వేగంగా వచ్చే బంతులను ఆడేందుకు ఇష్టపడతాడు. ప్రస్తుతం ఆర్‌సీబీ తుది జట్టులో తీవ్రమైన పోటీ ఉంది. వెంకటేష్ అయ్యర్‌ను ఏ స్థానంలో ఆడిస్తారో నాకు తెలియదు. గత సీజన్‌లో దేవదత్ పడిక్కల్ చాలా బాగా రాణించాడు. పడిక్కల్, రజత్ పాటిదార్, విరాట్ కోహ్లీతో పాటు కోచ్‌ల గురించి మాట్లాడితే.. వారు జట్టులో ఒక అద్భుతమైన వాతావరణాన్ని సృష్టించారు. టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్ వంటి ఆటగాళ్లకు నిర్దిష్టమైన పాత్రలను అప్పగించారు. వారు కూడా మేనేజ్‌మెంట్ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ.. తమ అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చారు. ఆర్‌సీబీ కోచ్‌లు ఇప్పుడు కొత్త ఆటగాళ్లను తయారు చేస్తున్నారు. అదే ఆ జట్టులో కనిపిస్తున్న ప్రధాన మార్పు. ప్రధాన బౌలర్ హాజెల్ వుడ్ అందుబాటులో లేకపోవడం వల్ల ఆరంభంలో ఆర్‌సీబీ కొన్ని ఇబ్బందులు ఎదుర్కోవచ్చు. కానీ ప్రస్తుత కోచింగ్ స్టాఫ్ ఎవరిని జట్టులోకి తీసుకువచ్చినా వారి నుంచి ఆశించిన ఫలితాన్ని రాబడుతున్నారు. గత సీజన్‌లో ఆరు, ఏడు సార్లు ప్రత్యర్థి జట్లను 150 పరుగుల లోపే కట్టడి చేశారు. ఇలా గతంలో ఎన్నడూ జరగలేదు. సుయాష్ వంటి ఆటగాడికి పెద్దగా అనుభవం లేకపోయినా.. అతని నుంచి మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శనలు రాబట్టారు. కృనాల్ పాండ్యా తన బౌలింగ్‌తో మ్యాచ్‌లు గెలిపించాడు. రీప్లేస్‌మెంట్‌గా ఎవరు వచ్చినా వారి నుంచి అత్యుత్తమ ప్రదర్శన రాబడుతున్నారు. ఆటగాళ్లు తమ సామర్థ్యానికి మించి రాణించేలా ఆర్‌సీబీ కోచ్‌లు ప్రోత్సహిస్తున్నారు. ఆర్‌సీబీ ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగాల్సి ఉంటుంది. ఎక్స్‌ట్రా స్పిన్నర్‌ను ఆడించాలనుకుంటే ఒక పేసర్‌ను వదులుకోవాల్సి వస్తుంది.



### వన్డే వరల్డ్ కప్ రేసు నుంచి

# వెస్టిండీస్ ఔట్ !

ఇటీవల టీ20 వరల్డ్ కప్ 2026లో భారత్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ మెగా టోర్నీ ముగిసిన వెంటనే వన్డే క్రికెట్ సందడి మొదలైంది. బంగ్లాదేశ్ వేదికగా పాకిస్తాన్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో బంగ్లా పులులు అద్భుత ప్రదర్శన చేశాయి. నిర్ణయాత్మకమైన చివరి వన్డేలో 11 పరుగుల తేడాతో విజయం సాధించి, సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకున్నాయి. ఈ గెలుపు బంగ్లాదేశ్ ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాకుండా, 2027 వరల్డ్ కప్ క్వాలిఫికేషన్ రేసులో ఆ జట్టును ముందు వరుసలో నిలబెట్టింది. బంగ్లాదేశ్ సాధించిన ఈ విజయంతో ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. తాజా ర్యాంకింగ్స్ ప్రకారం, బంగ్లాదేశ్ 10వ స్థానం నుంచి 9వ స్థానానికి ఎగబాకగా, వెస్టిండీస్ జట్టు 9 నుంచి 10వ స్థానానికి పడిపోయింది. 2027 వన్డే ప్రపంచకప్‌కు దక్షిణాఫ్రికా, జింబాబ్వే ఆతిథ్యం ఇస్తున్నాయి. ఆతిథ్య దేశాలుగా ఈ రెండు జట్లు నేరుగా అర్హత సాధించగా, మిగిలిన ఎనిమిది జట్లు ర్యాంకింగ్స్ ఆధారంగానే ప్రవేశిస్తాయి. వెస్టిండీస్ జట్టు 2027 ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించాలంటే టాప్-10లో కొనసాగడం తప్పనిసరి. కానీ, ప్రస్తుతం బంగ్లాదేశ్ జోరు చూస్తుంటే కరేబియన్ జట్టుకు కష్టాలు తప్పేలా లేవు. రాబోయే వన్డే మ్యాచుల్లో వెస్టిండీస్ ఓడిపోతే, ఆ జట్టు క్వాలిఫికేషన్ రేసు నుంచి పూర్తిగా తప్పుకోవాల్సి వస్తుంది. ఇప్పటికే గత వన్డే వరల్డ్ కప్‌నకు అర్హత సాధించలేకపోయిన వెస్టిండీస్, మరోసారి అటువంటి చేదు అనుభవాన్ని ఎదుర్కోవాల్సి రావడం ఆ జట్టు అభిమానులను ఆందోళనకు గురి చేస్తోంది. మరోవైపు, గత వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయిన భారత్, ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ టైటిల్ చేజార్చుకోకూడదని పట్టుదలగా ఉంది. సౌత్ ఆఫ్రికా గడ్డపై జరగనున్న ఈ మెగా టోర్నీ కోసం టీమిండియా ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికలతో సిద్ధమవుతోంది. మొత్తానికి 2027 వన్డే వరల్డ్ కప్ క్వాలిఫికేషన్ పోరు రసవత్తరంగా మారింది.


# దిల్లీ క్యాపిటల్స్‌కు బ్రేక్ ఇవ్వనున్న మిచెల్ స్టార్క్





క్రికెట్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐపీఎల్ 2026 రసవత్తర పోరుకు సమయం దగ్గరపడింది. మార్చి 28 నుంచి పండగ మొదలుకావాల్సి ఉండగా, టోర్నీ ప్రారంభానికి ముందే పలు జట్లకు ఊహించని షాకులు తగులుతున్నాయి. తమ జట్ల విజయాల్లో కీలక పాత్ర పోషిస్తారని భావించిన స్టార్ ప్లేయర్లు గాయాల బారిన పడి దూరం కావడం అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా రాజస్థాన్ రాయల్స్, దిల్లీ క్యాపిటల్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ వంటి జట్లు తమ ప్రధాన అస్త్రాలను కోల్పోయి ఇప్పుడు ప్రత్యామ్నాయాల వేటలో పడ్డాయి. సీజన్ ఆరంభానికి ముందే ఐపీఎల్ గ్లామర్‌ను తగ్గించేలా వరుసగా ఆటగాళ్లు తప్పుకుంటున్న ఈ పరిణామాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. రాజస్థాన్ రాయల్స్ జట్టుకు సీజన్ మొదలవ్వక ముందే భారీ ఎదురుదెబ్బ తగిలింది. చెన్నై సూపర్ కింగ్స్ నుంచి ట్రేడ్ ద్వారా రాజస్థాన్‌లోకి వచ్చిన ఇంగ్లాండ్ స్టార్ ఆల్ రౌండర్ సామ్ కరన్ గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యే అవకాశం ఉంది. మార్చి 5న భారత్ తో జరిగిన టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్ తర్వాత ఆయన ఎటువంటి మ్యాచ్ ఆడలేదు. కరన్ లేకపోవడం వల్ల ఆల్ రౌండర్ల విభాగంలో రాజస్థాన్ బలహీనపడనుంది. ప్రస్తుతం ఆ జట్టులో రవీంద్ర జడేజా, డోనోవన్ ఫెరీరా వంటి ఆల్ రౌండర్లు ఉన్నప్పటికీ, కరన్ స్థానాన్ని భర్తీ చేసే ఆటగాడి కోసం రాయల్స్ తీవ్రంగా అన్వేషిస్తోంది. ఈసారి రాజస్థాన్ రాయల్స్ జట్టుకు సరికొత్త సారథి రాబోతున్నాడు.

# టెన్నిస్ చాలా కష్టంగా అనిపిస్తోంది.. ఓడిపోయానంటే నమ్మలేకపోతున్నా..!

మహిళల టెన్నిస్‌లో మరో సంచలనం. ఒకప్పుడు వరల్డ్ నంబర్ 1 ఇగా స్వియాటెక్ మియామి ఓపెన్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. శుక్రవారం జరిగిన ఓపెనింగ్ మ్యాచ్‌లో ఈ టాప్ సీడ్ అనూహ్యంగా ఓటమి పాలైంది. రెండు గంటల 10 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో పోలె మగ్ద లినెట్టే చేతిలో స్వియాటెక్ చిత్తైంది. ఫేవరెట్‌గా ఇంటర్ మియామి ఓపెన్‌లో బరిలోకి దిగిన ఇగా స్వియాటెక్‌కు భారీ షాక్ తగిలింది. తొలి రౌండ్‌లోనే ఘోర పరాజయం చవిచూసింది మూడో ర్యాంకర్. 50వ ర్యాంకర్ పోలె మగ్ద లినెట్టే తొలి సెట్ నుంచి జోరు చూపించి 6-1, 5-7, 6-3తో స్వియాటెక్‌కు చెక్ పెట్టింది. దాంతో, డబ్ల్యూటీఏ టూర్‌లో తొలి రౌండ్‌లో 73 విజయాల రికార్డుకు బ్రేకు వేసింది.



# భారత్‌లో 2028 ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్




2028లో ప్రతిష్టాత్మక ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. పోలాండ్‌లోని టోరూన్ నగరంలో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. 2028 సంవత్సరానికి గానూ ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ ఆతిథ్య హక్కులను భారత్‌కు అప్పగించామని వరల్డ్ అథ్లెటిక్స్ వైస్ ప్రెసిడెంట్ అదిల్లే సుమరివాలా ప్రకటించారు. ఈ ఏడాదికి గానూ ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ పోలాండ్ నగరంలో మార్చి 20-22 వరకు జరగనుంది. ఈ ఈవెంట్ ప్రారంభం కావడానికి ఒక రోజు ముందు జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ కౌన్సిల్ 2028లో ప్రతిష్టాత్మక ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు ఆతిథ్యం ఇచ్చే బాధ్యతకు భారత్‌కు అప్పగించింది. ఈ క్రమంలో ఈ మెగా ఈవెంట్ ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని కళింగ ఇండోర్ అథ్లెటిక్స్ స్టేడియంలో జరగనుంది. కాగా, 2028 ప్రపంచ ఇండోర్ ఛాంపియన్‌షిప్ కోసం తమ బిడ్‌ను ఈ ఏడాది ప్రారంభంలోనే భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్‌ఐ) వేసింది. దీంతో ప్రపంచ అథ్లెటిక్స్ కౌన్సిల్ నుంచి ఇద్దరు సభ్యుల బృందం ఈ ఏడాది జనవరిలో భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియం కాంప్లెక్స్‌లో ఉన్న అత్యాధునిక ఇండోర్ సదుపాయాన్ని పరిశీలించింది. ఈ క్రమంలో తాజా నిర్ణయం వెలువడింది. కాగా, 2028లో జరగబోయే ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ ఆతిథ్య హక్కులు భారత్‌కు దక్కడంపై ఏఎఫ్‌ఐ అధ్యక్షుడు బహదూర్ సింగ్ సగూ సంతోషం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వేదికపై భారత అథ్లెటిక్స్ స్థాయి పెరుగుతోందనడానికి ఈ పరిణామం ఒక సూచిక అని పేర్కొన్నారు. "ప్రపంచ అథ్లెటిక్స్ 2028 ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌ను నిర్వహించే బాధ్యతను భారత్‌కు అప్పగించింది. ఇది భారత అథ్లెటిక్స్ స్థాయి పెరుగుదలకు నిదర్శనం. ప్రముఖ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా వరుసగా ఒలింపిక్, ప్రపంచ పతకాలు గెలిచినప్పటి నుంచి భారత ట్రాక్ అండ్ ఫీల్డ్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది." అని బహదూర్ సింగ్ సగూ వెల్లడించారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే ప్రతిష్టాత్మక ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి న్యూజిలాండ్ కూడా గతంలో ఆసక్తిని వ్యక్తం చేసింది. అయినప్పటికీ 2028లో ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహించే అవకాశం భారత్‌కు దక్కింది. భారత్ పోటీలో ఉన్నందున ఆతిథ్య దేశాన్ని ఎంపిక చేసే నిర్ణయం తీసుకున్నప్పుడు తమను లోపలికి అనుమతించలేదన్నారు సాంకేతిక కమిటీ ఛైర్మన్, ఏఎఫ్‌ఐ మాజీ కార్యదర్శి రవీందర్ చౌదరి. ఆ తర్వాత ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని భారత్‌కు ఇచ్చినట్లు వరల్డ్ అథ్లెటిక్స్ కౌన్సిల్స్ ప్రకటించిందని తెలిపారు. ప్రపంచ ఇండోర్ ఛాంపియన్‌షిప్స్‌లో సాధారణంగా మూడు రోజుల పాటు 26 ఈవెంట్‌లు (పురుషులకు, మహిళలకు చెరో 13) జరుగుతాయి. పోలాండ్‌లో జరుగుతున్న ఈ ఎడిషన్‌లో 4ఇ400 మీటర్ల మిక్స్‌డ్ రిలేను మొదటిసారిగా నిర్వహిస్తున్నారు. ఆ 13 ఈవెంట్లలో 60 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 1500మీటర్లు, 3000 మీటర్లు, 60 మీటర్లు హర్డిల్స్, 4ఇ400 మీటర్లు రిలే, హై జంప్, పోల్ వాల్ట్, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, షాట్ పుట్, హెప్టాథ్లాన్ (మహిళలకు పెంటాథ్లాన్) ఉన్నాయి. భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియం కాంప్లెక్స్‌లో 2024లో ప్రారంభమైంది. అక్కడి అత్యాధునిక ఇండోర్ ఫెసిలిటీలో 2028 ఏషియన్ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి భారత్ కూడా బిడ్ దాఖలు చేసింది. ఈ క్రమంలో ఏషియన్ అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు చెందిన ఇద్దరు సభ్యుల ప్రతినిధి బృందం ఈ ఏడాది కళింగ స్టేడియం కాంప్లెక్స్‌ను పరిశీలించింది.

# ఉస్తాద్ భగ్ సింగ్ హిట్ టాక్

## దర్శకుడు హరీష్ శంకర్ ఆనందం



ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా బాగుందన్న అభిప్రాయం రావడం ఎంతో ఆనందాన్నిచ్చిందని దర్శకుడు హరీష్‌శంకర్ అన్నారు. ఆయన దర్శకత్వంలో... పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, రవిశంకర్.వై సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం ఉగాది సందర్భంగా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం విలేకర్ల సమావేశం నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'పవన్‌కల్యాణ్ అభిమానులు ఫోన్ చేసి 'అన్నా సినిమా చాలా బాగుంది' అంటున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులకూ నచ్చేలా సినిమాని మలిచాం. తొలి రోజు నుంచీ ఓ కమర్షియల్ సినిమా తీస్తున్నానని, ఒకప్పటిలా హుషారైన పవన్‌కల్యాణ్ ఇందులో కనిపిస్తారని చెబుతూ వచ్చా. సినిమా చూసినవాళ్లు ఈ సినిమాలో ఇన్ని అంశాలు ఉన్నాయని మాకు తెలియదంటూ ఆశ్చర్యపోతున్నారు. ఇందులోని ప్రతి పాత్ర బాగా పండింది. అందరికృషితోనే ఇంత మంచి సినిమా చేయగలిగాం అన్నారు. నిర్మాత నవీన్ ఎర్నేని మాట్లాడుతూ థియేటర్ల దగ్గర పండగ వాతావరణం కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అమెరికా అనే తేడా లేకుండా అన్ని చోట్లా ప్రేక్షకులు సినిమాని ఆస్వాదిస్తున్నారు. మేం ఊహించిన దానికంటే మంచి స్పందన వచ్చింది. పవన్ కల్యాణ్ వన్ మేన్ షో ఇది. హరీశ్‌శంకర్ ఎంతో బాధ్యతగా 'గబ్బర్‌సింగ్' సినిమాని మించేలా తెరకెక్కించారు. కచ్చితంగా భారీ వసూళ్లు సాధిస్తుందీ చిత్రం' అన్నారు. నిర్మాత రవిశంకర్.వై మాట్లాడుతూ 'పెద్ద హీరో నుంచి వాణిజ్య ప్రధానమైన సినిమా వచ్చి చాలా కాలమైంది. ఇందులో కుటుంబ ప్రేక్షకులు మెచ్చే అంశాలూ ఉన్నాయి. మాకు ఎప్పటికీ గుర్తుండిపోయే ఈ సినిమా విజయంపై మేం సంతోషంగా ఉన్నాం' అన్నారు. ఈ కార్యక్రమంలో కళా దర్శకుడు ఆనంద్‌సాయి, గీత రచయిత చంద్రబోస్ పాల్గొన్నారు.

# సర్కే చునార్ తేరి సర్కే పాట వివాదం

## నోరా ఫతేహిపై ముస్లిం సంస్థ ఫత్వా జారీ



కన్నడ చిత్రం 'కేడీ: ద డెవిల్' లోని 'సర్కే చునార్ తేరి సర్కే' పాట తీవ్ర వివాదాలకు దారితీసిన సంగతి తెలిసిందే. అయితే ఈ పాటలో నటించిన బాలీవుడ్ నటి నోరా ఫతేహీపై అలీగఢ్‌కు చెందిన ముస్లిం పర్సనల్ దారుల్ ఇఫ్తా అనే మతపరమైన సంస్థ ఫత్వా జారీ చేసింది. ఈ పాటలోని సాహిత్యం ఇస్లామిక్ బోధనలకు విరుద్ధంగా ఉందని సదరు సంస్థ పేర్కొంది. ఇటువంటి ప్రదర్శనలు సమాజంలో తప్పుడు సందేశాన్ని పంపుతాయని, ముఖ్యంగా ముస్లిం యువతను తప్పుదోవ పట్టిస్తాయని వారు తమ ఫత్వాలో పేర్కొన్నారు. మరోవైపు ఈ పాటకు దేశవ్యాప్తంగా వస్తున్న నిరసనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ పాటపై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో ఈ విషయాన్ని ధృవీకరించారు. మరోవైపు ఈ వివాదంపై నోరా ఫతేహీ స్పందిస్తూ.. ఈ పాట హిందీ వెర్షన్‌లో తనకేమీ సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు. మూడేళ్ల క్రితం సంజయ్ దత్ వంటి దిగ్గజ నటుడితో కలిసి నటించే అవకాశం రావడం, అలాగే ఇది 'నాయక్ నహి ఖల్ నాయక్ హూ మై' వంటి ఐకానిక్ సాంగ్ రీమేక్ అని భావించి తాను అంగీకరించానని తెలిపారు. తనకు కన్నడ భాష తెలియదని, మేకర్స్ చెప్పిన అనువాదం అప్పట్లో అభ్యంతరకరంగా అనిపించలేదని ఆమె వివరణ ఇచ్చారు. ధ్రువ సర్జా హీరోగా, ప్రేమ్ దర్శకత్వంలో 1970ల నాటి బెంగళూరు నేపథ్యంతో తెరకెక్కిన 'కేడీ: ద డెవిల్' చిత్రం ఏప్రిల్ 30న విడుదల కానుంది.

# మణిరత్నం. రహమాన్ కాంబో

## సాయిపల్లవి, విజయ్ సేతుపతి మూవీ



దిగ్గజ దర్శకుడు మణిరత్నం తన ఆస్థాన సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్‌తో మరోసారి చేతులు కలుపబోతున్నాడు. 1992లో 'రోజా' సినిమాతో మొదలైన వీరిద్దరి అద్భుత ప్రయాణం, ఇప్పుడు 19వ సారి ఈ కొత్త సినిమాతో కొనసాగబోతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో 'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి హీరోగా నటించబోతుండగా.. 'నేచురల్ స్టార్' సాయి పల్లవి మణిరత్నం సినిమాలో హీరోయిన్‌గా నటించబోతుంది. గత కొద్ది రోజులుగా ఈ సినిమాకు యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ పనిచేస్తారనే ప్రచారం జరిగినప్పటికీ, వాటన్నింటికీ చెక్ పెడుతూ మద్రాస్ టాకీస్ సంస్థ రెహమాన్ పేరును అధికారికంగా ప్రకటించింది. ఒక ఫీల్ గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం కోసం రెహమాన్ ఇప్పటికే ఒక పాటను కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. మద్రాస్ టాకీస్ మరియు లైకా ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది జూలై నాటికి ప్రారంభం కానుంది.

# దురంధర్ -2 కు మంచి రెస్పాన్స్



దేశభక్తి అంశాలతో కూడిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' ఓ ట్రెండ్ సెట్ చేసింది. భారీ అంచనాల నడుమ విడుదలైన ఈ మూవీ సీక్వెల్ 'ధురంధర్ 2' కూడా బాక్సాఫీసు వద్ద దూసుకెళుతోంది. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నటుడు రాకేశ్ బేడీ ఈ విజయంపై హర్షం వ్యక్తంచేశారు. ఈ రెండు సినిమాల్లో కీలకమైన జమిల్ జమాల్ పాత్ర పోషించిన ఆయన.. తన పెర్ఫామెన్స్‌పై హీరో రణ్‌వీర్ సింగ్ ఇచ్చిన ప్రశంసను గుర్తుచేసుకున్నారు. ఈ చిత్ర బృందమంతా సెట్స్‌లో కలివిడిగా ఉండేది. నా పాత్ర షూటింగ్ పూర్తయిన రోజు.. రణ్‌వీర్ మైక్ తీసుకొని 'ఒకవేళ ఈ మూవీ రూ.1000 కోట్లు వసూలుచేస్తే.. అందులో రూ.500 కోట్లు రాకేశ్ వల్లే వస్తాయి' అని చెప్పారు. ఓ నటుడిగా ఇంతకుమించి ఏం కావాలి?' అని పేర్కొన్నారు. సీనియర్ పొలిటీషియన్‌గా నయవంచక పాత్రలో రాకేశ్ బేడీ అదరగొట్టారు. ముఖ్యంగా 'ధురంధర్ 2'లో ఈ పాత్ర ఇచ్చే ట్విస్ట్ ప్రేక్షకులకు ఓ ట్రీట్. బాలీవుడ్‌లో 47 ఏళ్ల ప్రస్థానం రాకేశ్ బేడీది. 'ధురంధర్' డైరెక్టర్ ఆదిత్యధర్ గతంలో తెరకెక్కించిన మరో హిట్ మూవీ 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్'లోనూ నటించారు. సినీప్రియుల ఆసక్తిని దృష్టిలోపెట్టుకొని 'ధురంధర్ 2'ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసిన సంగతి తెలిసిందే. తొలిరోజే రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. ప్రపంచవ్యాప్తంగా రూ.172 కోట్లు (గ్రాస్) వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. నెట్ పరంగా రూ.145 కోట్లు అని పేర్కొన్నాయి. ఇందులో దాదాపు రూ.100 కోట్లు హిందీలోనే రావడం గమనార్హం. పెయిడ్ ప్రివ్యూల ద్వారా రూ.40? కోట్లు వచ్చాయని తెలిసింది. నెట్ కలెక్షన్లలో ఫస్ట్‌డే అత్యధిక వసూలు చేసిన బాలీవుడ్ మూవీగా 'ధురంధర్ 2' రికార్డులు నెలకొల్పింది.

# అట్టహాసంగా గద్దర్ ఫిల్మ్ అవార్డులు

## ఉగాది రోజు సిఎం రేవంత్ చేతుల మీదుగా ప్రదానం



తారల రాకతో పులకించిన చిత్రసీమ ఉగాది సందర్భంగా గద్దర్ తెలంగాణ సినీ అవార్డులు వేడుక అంగరంగ వైభవంగా సాగింది. చిత్రసీమ మొత్తం తరలిరావడంతో సంబరాలు అంబరాన్ని అంటాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ సినీ పురస్కారాల్ని ఏర్పాటు చేసి రెండేళ్లుగా ఘనంగా ప్రదానం చేస్తోంది. ఉగాది అనగానే గతంలో తెలుగు ప్రేక్షకులు.. చిత్రసీమ సినీ పురస్కారాల పండగని గుర్తు చేసుకొనేది. పలు కారణాలతో మధ్యలో పద్నాలుగేళ్లపాటు ఈ పురస్కారాలకు నోచుకోలేకపోయింది తెలుగు సినిమా. గతేడాది నుంచి సినిమా రంగంలోని ప్రతిభకు పట్టం కడుతూ... ఉత్తమ చిత్రాల రూపకల్పన కోసం ప్రోత్సాహాన్ని అందించడంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ సినీ పురస్కారాల్ని ప్రదానం చేస్తోంది. గత ఆనవాయితీ మేరకే ఈసారి ఉగాది సందర్భంగానే గద్దర్ సినీ పురస్కారోత్సవం – 2025 వేడుకని నిర్వహించడం విశేషం. తెలుగు సంవత్సరాది రోజున... పురస్కారాల్ని చేతపట్టి సినీ తారలు, సాంకేతిక బృందాలు, దర్శక నిర్మాతలు మురిసిపోయారు. దక్షిణాది తారలతోపాటు... హిందీ తారలూ ఈ వేడుకలో పాల్గొని ప్రధాన ఆకర్షణగా నిలిచారు. సాంస్కృతిక కార్యక్రమాలు, జ్యోతిప్రజ్వలనతో ప్రారంభమైన ఈ వేడుక ఆద్యంతం సందడిగా సాగింది. అలనాటి తారలు సావిత్రి, శ్రీదేవి, సౌందర్య తదితరుల్ని గుర్తు చేస్తూ... కథానాయిక నిధి అగర్వాల్ వేదికపై చేసిన నృత్యాలు, గాయని మంగ్లీ ఆటాపాట, 'నాగబంధం'లోని నమోరే పాటకు నభా నటేశ్, దక్ష నాగర్కర్ నృత్యాలు, దేవిశ్రీప్రసాద్ హుషారెత్తించేలా పాడిన పాటలు, ఆయన మార్క్ సంగీత ప్రదర్శనలు వేడుకకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలుగుసినీ తారలు, పురస్కార గ్రహీతలతోపాటు హిందీ నుంచి వచ్చిన మాధురీ దీక్షిత్, జెనీలియా, రితేశ్ దేశ్‌ముఖ్ సందడితో వేడుక కళకళలాడింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పర్యటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, టీఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, ఎఫ్.డి.సి ఎండీ సీహెచ్ ప్రియాంక తదితరులు విజేతలకు పురస్కారాల్ని ప్రదానం చేశారు. సాయిప్రసాద్ (తండ్రి రమేశ్ ప్రసాద్ బదులుగా, రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డు), సుద్దాల అశోక్ తేజ (సి.నారాయణరెడ్డి ఫిల్మ్ అవార్డు), అశ్వినీ దత్ (నాగిరెడ్డి చక్రపాణి అవార్డు), కమల్‌హాసన్ (సింగీతం శ్రీనివాసరావుకు బదులుగా, బీఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డు) దక్కించుకున్నారు. సిఎంరేవంత్‌రెడ్డి, రామ్‌చరణ్ చేతుల మీదుగా పురస్కారం స్వీకరిస్తున్న నాగచైతన్య, రష్మిక ఉత్తమ నటి పురస్కారం అందుకోవడానికి వేదికపైకి వచ్చిన రష్మిక మందన్నని 'మా ఊరి కోడలు...' అంటూ యాంకర్ సుమకి పరిచయం చేశారు రేవంత్‌రెడ్డి. పురస్కారం అందుకున్న అనంతరం రష్మిక మాట్లాడుతూ రేవంత్ రెడ్డి చేతులమీదుగా అందుకున్న ఈ పురస్కారం ఎంతో ప్రత్యేకం. రాష్ట్ర ప్రభుత్వం నా నటనని మెచ్చి పురస్కారం ఇచ్చిందని అన్నారు. ఉత్తమ నటుడిగా పురస్కారం అందుకున్న నాగచైతన్య మాట్లాడుతూ 'పదహారేళ్ల సినీ ప్రయాణంలో ఇదెంతో ప్రత్యేకమైన గుర్తింపు. గద్దర్ గొప్ప వ్యక్తి, విప్లవకారుడు. ఆయన పేరు మీద ఏర్పాటు చేసిన ఈ పురస్కారాన్ని అందుకున్నందుకు ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, సీనియర్ కథానాయిక మాధురీ దీక్షిత్ నుంచి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందుకున్న అనంతరం చిరంజీవి మాట్లాడుతూ 'కళాకారులకు ఎక్కడ గౌరవం దక్కుతుందో ఆ రాష్ట్రం, ఆ దేశం, ఆ రాజ్యం సుభిక్షంగా ఉంటుందని నానుడి. దాని అర్థం పరమార్థం గ్రహించి నిర్లక్ష్యానికి గురైన పురస్కారాల్ని మళ్లీ పునరుద్ధరించి, పునరుజ్జీవం పోసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. మేం కలిసిన ప్రతిసారీ సినిమా గురించి, సినిమా అభివృద్ధి గురించే చర్చ ఉంటుంది. తెలుగు సినిమా, దక్షిణ భారత సినిమా అని కాదు, భారతదేశ సినిమాకు హైదరాబాద్‌ని కేంద్రంగా నిలిపేందుకు, ఆ దిశగా తెలుగు చిత్ర పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు సమాయత్తం అవుతున్నట్టు



ముఖ్యమంత్రి చెప్పారు. గ్లోబల్ సమ్మిట్ జరిగినప్పుడు సినిమాకి ప్రాధాన్యం కల్పించారు. చిత్ర పరిశ్రమకు చెందిన మంచి చెడులు చర్చించి సదుపాయాలు కల్పించేందుకు ముందుకొచ్చారు. సినిమావాళ్లకు అతి దగ్గరగా ఉన్నటువంటి ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గద్దర్ సినీ పురస్కారాల్ని స్ఫూర్తిగా తీసుకొని, ఆ దిశగా ప్రోత్సహిస్తే యువతరం మరిన్ని సినిమాలు చేస్తుంది' అన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, కథానాయకుడు నాగార్జున చేతులమీదుగా అక్కినేని నాగేశ్వరరావు పురస్కారం అందుకున్న జయసుధ మాట్లాడుతూ 'ఏఎన్నార్‌తో ఎన్నో గొప్ప చిత్రాల్లో నటించాను. ఆయన హృదయానికి చికిత్స జరిగిన అనంతరం తిరిగి సినిమాల్లోకి వచ్చినప్పుడు 'ట్రెండ్ మారిపోయింది కదా, నటనలో ఏమైనా మార్పులు చేసుకోవాలా?' అంటూ అప్పుడప్పుడే పరిశ్రమలోకి వచ్చిన నటుడిలా అడిగేవారు. అంత గొప్ప నటుడు అంత సాధారణంగా ఉండటం మా అందరికీ ఓ గొప్ప పాఠం' అన్నారు. కాంతారావు పురస్కారాన్ని అందుకున్న ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ 'పదమూడేళ్లపాటు సినీ పరిశ్రమ పురస్కారాల కోసం ఎదురు చూసింది. అలాంటిది సూపర్‌స్టార్ కృష్ణ అభిమాని అయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతేడాది పురస్కారాల్ని పునః ప్రవేశపెట్టి తెలుగు సినిమా ఉనికిని, కళాకారుల్ని గుర్తించి, గౌరవించినందుకు నా అభినందనలు. గద్దర్ ప్రజా వాగ్గేయకారుడు. ఆయన పేరుపై ఈ పురస్కారాల్ని అందించినందుకు నా సెల్యూట్. ఎన్టీఆర్, ఏఎన్నార్ తర్వాత అంతటి మరో హీరో కాంతారావు. తెలంగాణ గడ్డ బిడ్డ అయిన ఆయన పేరుపై పురస్కారాన్ని నాకు ఇచ్చి జన్మ ధన్యం చేశారు' అన్నారు. బి.ఎన్.రెడ్డి పురస్కారానికి ఎంపికైన సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తరఫున కమల్‌హాసన్ పురస్కారాన్ని స్వీకరించడం విశేషం. పైడి జయరాజ్ పురస్కారాన్ని అందుకున్న కమల్‌హాసన్ మాట్లాడుతూ 'సింగీతం పురస్కారం అందుకున్నప్పుడు నాకు ఆయన 'సొమ్మొకడిది సోకొకడిది' సినిమా గుర్తుకొచ్చింది. గద్దర్‌కు ఉన్న మిలియన్లకొద్దీ అభిమానుల్లో నేను ఒకడిని. నా సినిమా కెరీర్‌లో నేను కలిసిన అత్యంత యువకుడైన సీనియర్ ఆయన. కవి, విప్లవకారుడైన ఆయన్ను గౌరవిస్తూ ఈ పురస్కారం ఏర్పాటు చేయడంతోనే మా అందరికీ గౌరవం దక్కినట్లైంది.'అన్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613